


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | శుక్రవారం 21-03-2025 | సంపుటి - 22 | సంచిక - 327 | రూ : 4 | పేజీలు: 8


## అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు



- 'తెలంగాణ... జరూర్ ఆనా' నినాదంతో విస్తృత ప్రచారం
- 140 దేశాల నుంచి యువతుల రాక: జూపల్లి
- గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభం... హైటెక్స్‌లో ముగింపు; మంత్రి జూపల్లి వెల్లడి
- వివరాలు వెల్లడిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు రాష్ట్రం సిద్ధం అవుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'తెలంగాణ... జరూర్ ఆనా' (తెలంగాణకు తప్పక రండి) అనే నినాదంతో మే 7 నుంచి 31 వరకు జరగనుంది. పోటీల్లో పాల్గొనడానికి ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల

తరువాయి 2లో



## మాట నిలబెట్టుకున్నాం

- 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ
- 2026లో జనగణన తర్వాత జిల్లాల వారీగా అమలు చేస్తాం
- బుడగ జంగాలను ఎస్సీల్లో చేరుస్తూ తీర్మానం చేస్తున్నాం
- వర్గీకరణపై నా ఆలోచన సబబేనని సుప్రీంకోర్టు తీర్పు చాటిచెప్పింది
- ఎస్సీలపై వివక్షను ప్రస్తావిస్తూ శాసనసభలో చంద్రబాబు భావోద్వేగం

అమరావతి : ఎస్సీ వర్గీకరణపై ఎన్నికల సమ యంలో చెప్పినట్లుగానే మాట నిలబెట్టుకు న్నామని, 30 ఏళ్ల నిరీక్షణకు మంచి ముగింపు పలికామని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు తెలిపారు.

తరువాయి 2లో

## మరో 30 రోజుల్లో గ్రూప్స్ నియామకాలు

- నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓటమి: సీఎం రేవంత్‌రెడ్డి
- 922 మందికి కారుణ్య, ఉద్యోగ నియామకపత్రాల అందజేత
- 'బిల్డ్‌నౌ పోర్టల్'ను ప్రారంభించిన సీఎం

హైదరాబాద్: నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే ఎన్నికల్లో భారాస ఓడిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు ఉద్యోగాలు ఇవ్వనివారికి ఉద్యోగాలు ఎందుకనే ఉద్దేశంతో ఆ పార్టీని నిరుద్యోగులుఓడించారన్నారు. భారాస ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పులు రాష్ట్రానికి గుదిబండగా మారాయని, ప్రతినెలా రూ.10 వేల కోట్ల చొప్పున అసలు, మిత్తి కింద ఇప్పటివరకు రూ.1.53 లక్షల కోట్లు చెల్లించామని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణానికి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారని, దాన్ని 45 శాతం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక

తరువాయి 2లో



## సినీ ప్రముఖులపై బెట్టింగ్ యాప్‌ల కేసు



- నిందితుల్లో నటులు రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, వైకాపా నేత శ్యామల సహా 25 మంది
- మియాపూర్ పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్
- మరో కేసులో విచారణకు హాజరైన ఇద్దరు యాంకర్లు

హైదరాబాద్: నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారం యాంకర్లు, బుల్లితెర నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి సినీ ప్రముఖుల దాకా వెళ్లింది. గురువారం మియాపూర్ పోలీసుస్టేషన్‌లో

తరువాయి 2లో



## ట్రంప్ ఫోన్‌కాల్‌తో ఎలాంటి ఒత్తిడి ఎదుర్కోలేదు

- రష్యా నుంచి విరమణ పత్రం కావాలి
- అంతవరకు పోరు కొనసాగుతుంది: జెలెన్‌స్కీ

కీవ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్లో మాట్లాడినప్పుడు తాను ఎలాంటి ఒత్తిడి ఎదుర్కోలేదని, ముఖ్యమైన అంశాలపై సానుకూల చర్చలు జరిగాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.

తరువాయి 2లో

## నయనానందకరం.. కదిరి ఖాద్రీశుడి రథోత్సవం

కదిరి : శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం నయన శోభితంగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభులు కొలువుదీరిన రథం ముందు ఆవాహన చేస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, యశోదాదేవి దంపతులు పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు నిర్ణయించిన సుముహూర్తానికి బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించారు. రథంపై స్వామివారు తిరు వీధుల్లో పర్యటించారు. సాయంత్రం 3.53 గంటలకు రథం యథాస్థానానికి చేరింది. ఈ ఉత్సవానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచీ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.





## దొంగల్లా వచ్చి.. సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు

- వైకాపా ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేస్తున్నారు
- దొంగచాటుగా సంతకాలు పెట్టాల్సిన ఖర్మేంటి?
- ఎన్నుకున్న ప్రజలకు తలవంపులు తెచ్చేలా ప్రవర్తించొద్దు
- సభాపతి అయ్యన్నపాత్రుడు ధ్వజం 2లో



## భారత సైన్యం అమ్ములపొదిలోకి మరిన్ని అస్త్రాలు

- రూ.54 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు డీఏసీ ఆమోదం
- 7 వేల కోట్ల విలువైన శతఘ్నుల కొనుగోళ్లకు కేంద్రం పచ్చజెండా

సాయుధ దళాల ఆధునికీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని.. 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. రక్షణశాఖమంత్రి

తరువాయి 2లో

## రూ.2 వేల కోట్లతో తైవాన్ పారిశ్రామిక పార్క్

- ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకు ఒప్పందం

హైదరాబాద్: తైవాన్‌కు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల సమూహం (ఎలీజియన్స్ గ్రూప్) హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో మొట్టమొదటి ప్రపంచస్థాయి సాంకేతిక, పారిశ్రామిక పార్క్(ఐటీఐపీ)ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు... నిర్దిష్ట కార్యాచరణతో రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రస్తుతం తైవాన్ రాజధాని తైపీలో పర్యటిస్తోంది. తైవాన్‌భారత ఆర్థిక సంబంధాల పురోగతి కార్యక్రమంలో భాగంగా.. గురువారం 11

తరువాయి 2లో



# మరో 30 రోజుల్లో గ్రూప్స్ నియామకాలు

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించిన రూ.1.53 లక్షల కోట్లు తమ చేతిలో ఉంటే 75 లక్షల మందికి రుణమాఫీ చేసేవాళ్లమని, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేసేవాళ్లమని ఆయన పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.8,000 కోట్లను భారాస పెండింగ్ పెట్టడంతో వాటిని చెల్లించడం సమస్యగా మారిందన్నారు. అతికష్టమ్మీద ప్రతినెలా రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో త్వరలో మరో 3040 రోజుల్లో గ్రూపు 1, 2, 3లలో 2 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటించారు. తెలంగాణలో యాదగిరిగుట్ట దేవస్థానం ఉండగా తితిదేను ప్రతిసారి అడుక్కోవడం ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య, కొత్త నియామకాలకు సంబంధించి 922 మందికి పత్రాలు అందజేశారు. బిల్డ్‌నౌ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

### పదేళ్ల కల సాకారం

"నియామక పత్రాలు అందుకుంటున్న వారికి, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు. మీ కల నిజం కాబోతోంది. ముఖ్యమంత్రి పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించినప్పుడే నాకు ఎక్కువ సంతోషం కలిగింది. తొలి ఉద్యోగం ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగం చేసినంత కాలం గరంగా ఉండాలి తప్ప బేషరం కావద్దు. గత సర్కారు నియామకాలు చేపట్టకపోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదు. తెలంగాణ సాధనలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. ఎంతోమంది ప్రాణత్యాగం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడినా తెలంగాణ కోసం అమరులైనవారి ఆశయాలు, నిరుద్యోగుల కలలు నెరవేరలేదు. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస పోటీ పరీక్షలను నిర్వహించలేదు. మేం ఏడాదిలోనే 59 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గతంలో నోటిఫికేషన్లు వేయాలని ధర్నాలు చేసేవారు. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. పరీక్షలు వద్దు, వాయిదా వేయండి అంటూ నిరుద్యోగులు ధర్నా చేసే పరిస్థితి వచ్చింది. వాళ్లు చేయలేని పని మేం చేస్తోంటే భారాస నేతలు తట్టుకోలేకపోతున్నారు. తామే నోటిఫికేషన్లు వేశామని, మేం చేసిందేమీ లేదనిమాట్లాడుతున్నారు.

### నాపై ఎందుకుంటుంది కోపం?

నాపై వ్యతిరేకత, కోపం ఉందని కొందరంటున్నారు. ఎందుకు కోపం? 59 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకా? రైతు రుణమాఫీ చేసినందుకా? మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందుకా? వారిని కోటీశ్వరులను చేస్తున్నందుకా? అదానీ, అంబానీలతో పోటీపడేలా ఆడబిడ్డలకు సోలార్ విద్యుదుత్పత్తి చేసే అవకాశం కల్పించినందుకా? పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా?

### అదే టెంపర్‌మెంట్!

ఇరవై ఏళ్ల క్రితం జడ్పీటీసీ సభ్యుడిని అయినప్పటి నుంచి ఉన్న టెంపర్‌మెంట్‌తోనే ఇప్పటికీ వ్యవహరిస్తున్నాను. హుందాగా వ్యవహరించాలంటున్నారు. జానారెడ్డి ఎంత హుందాగా ఉండేవారు. అలా ఉండడం వల్ల కేసీఆర్ అవమానించారు. హోదాను బట్టి నా విజన్ మారుతోంది. కానీ, టెంపర్‌మెంట్ మారలేదు. అస్సలు మార్చుకోను. రేవంత్‌రెడ్డికి పట్టు రాలేదని కొందరు మాట్లాడుతున్నారు. రాజయ్య, ఈటల లాంటి వారిని సస్పెండ్ చేస్తేనే పట్టు వచ్చినట్టా? మా ప్రభుత్వంలో నేను, సీతక్క, శ్రీధర్‌బాబు.. ఇలా 11 మందిమి మాత్రమే మారాం. పోలీసులు, ఇతర వ్యవస్థ పాతదే. గతంలో కోదండరాం ఇంటి తలుపులు పగులగొట్టినోళ్లు.. మేం ఆదేశాలు ఇస్తే కేసీఆర్ ఇంటి తలుపులు పగులగొట్టడం ఎంతసేపు? వాళ్లలాగా మేం అణచివేయాలనుకుంటే ఎంతసేపు?

### * అందాల పోటీలతో రూ.వందల కోట్ల ఆదాయం..

మిస్ వరల్డ్ పోటీలపై కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. పర్యాటక రంగానికి ఇది ఒక అద్భుతమైన అవకాశం. మిస్ వరల్డ్ పోటీలతో ప్రపంచం తెలంగాణ వైపు చూడబోతోంది. వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులు తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించబోతున్నారు. 3,000 అంతర్జాతీయ ఛానెళ్లు, పత్రికలు వస్తాయి. మేం దుబారా ఖర్చులు చేయం. ఐదో, పదో కోట్లు ఖర్చు చేస్తే హోటల్, ఫుడ్ ఇండస్ట్రీకి రూ.వందల కోట్ల ఆదాయం వస్తుంది. ఫార్ములా ఈ రేస్ ముసుగులో ప్రభుత్వ సొమ్ము దోచుకున్నవారికి, మాకు పోలికా?

### ఈ ప్రశ్నకు మోదీ సమాధానం చెప్పాలి

ప్రధాని మోదీ అంటే నాకు గొప్ప గౌరవం. కానీ, ఈ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాలి. అభివృద్ధి అంతా దక్షిణాదిలోని తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లోనే ఉంది. గుజరాత్, యూపీ, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశాల నుంచి నిరుద్యోగులు మన వద్దకు ఉద్యోగాల కోసం వస్తున్నారు. ఇక్కడి నుంచి మీ వద్దకు ఎందుకు రావడం లేదు? మేం అభివృద్ధి సాధించినట్లా.. మీరు చేసినట్లా?

### * అక్రమాలను నిరోధించేందుకు 'బిల్డ్‌నౌ పోర్టల్'

హైదరాబాద్ నగరంలో భవన నిర్మాణ అనుమతుల్లో అక్రమాలను అరికట్టేందుకే బిల్డ్‌నౌ పోర్టల్‌ను తీసుకొచ్చాం. గతంలో మాన్యువల్‌గా అనుమతులు ఇచ్చేవారు. వాటి రికార్డులు దొరకడం లేదు. ఇకపై ఎంతటివారైనా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాల్సిందే. దీనిపై కొందరు బిల్డర్లు నామీద అలిగారు. ఎవరు ఒత్తిడి తెచ్చినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే పరిశీలించి, దాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టి పారదర్శకతతో అనుమతి ఇస్తాం. కొత్త విధానం వల్ల భవనాలు కట్టే భూమి ఎవరిదో, చెరువులో ఉందో, నాలాలో ఉందో తెలుస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

# అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి అందగత్తెలు తరలి రానున్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమం మే 10న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో, ముగింపు వేడుకలు అదే నెల 31న హైటెక్స్‌లో జరుగుతాయి. ఈ మధ్యలో రాష్ట్రంలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలకు యువతులను తీసుకెళతారు. మొత్తం 21 ప్రదేశాల్లో 23 థీమ్‌లతో ఈవెంట్లు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు మిస్ వరల్డ్ పోటీల నిర్వాహకులు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు, మిస్ వరల్డ్(2024) క్రిస్టినా పిజ్కోవా తదితరులు గురువారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో 72వ ఎడిషన్ మిస్ వరల్డ్ పోటీల పోస్టర్‌ను, తెలంగాణ పర్యాటక శాఖ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి క్రిస్టినా పోచంపల్లి ఇక్కత్ చీర కట్టుతో వచ్చి ఆకట్టుకున్నారు.

### * తెలంగాణకు సదవకాశం, గర్వకారణం

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... "మిస్‌వరల్డ్ పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తాం. తెలంగాణ సాంస్కృతిక, పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేసే సదవకాశం వచ్చింది. ఇది రాష్ట్రానికి గర్వకారణం. ఈ పోటీలను హైదరాబాద్‌లో జరిగేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో మేం గట్టిగా ప్రయత్నించి సఫలమయ్యాం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే మా ప్రయత్న ప్రధాన ఉద్దేశం. వీటికయ్యే ఖర్చు రూ.54 కోట్లు. అందులో నిర్వాహకులు, ఆతిథ్య రాష్ట్రం 5050 భాగస్వామ్య నమూనాను అనుసరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.27 కోట్లు భరించాల్సి ఉంది. ఇందులో పర్యాటకశాఖ ఇచ్చేది రూ.5 కోట్లు. మిగతా రూ.22 కోట్లను టూరిజం కార్పొరేషన్ స్పాన్సర్ల ద్వారా సేకరిస్తుంది' అని వివరించారు.

### * భారత్‌కు నా హృదయంలో ఎంతో ప్రాధాన్యం

భారతదేశానికి రాగానే తనకు చాలా గొప్పగా స్వాగతం పలికారని ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా తెలిపారు. ఆమె మాట్లాడుతూ... "నా ప్రయాణానికి ఇండియానే వేదిక. ముంబయిలో జరిగిన 71వ మిస్ వరల్డ్ పోటీల్లో విజేతగా నిలిచా. తెలంగాణకు వచ్చాక యాదగిరిగుట్టకు వెళ్లా. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చింది. నా హృదయంలో భారతదేశానికి చాలా ప్రాధాన్యముంది" అని అన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈవో జూలియా మోర్లీ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్నాం

(మొదటిపేజీ తరువాయి)

వర్గీకరణపై అపోహలు అక్కర్లేదని, ఎవరికీ నష్టం జరగదని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో గురువారం చేపట్టిన లఘుచర్చకు సీఎం సమాధానమిచ్చారు. 'ఎస్సీ ఉపకులాల్లో సమన్యాయం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వర్గీకరణ చేశాం. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని నిర్ణయించాం. 2026 జనగణన తర్వాత వర్గీకరణను జిల్లాల వారీగా అమలుచేస్తాం. అందరికీ సామాజిక న్యాయం అందించేందుకు కట్టుబడి ఉన్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

'సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా రాజీవ్‌రంజన్ మిశ్ర ఏకసభ్య కమిషన్‌ను నియమించాం. మొత్తం 59 కులాలను కమిషన్ మూడు గ్రూపులుగా విభజించి, రిజర్వేషన్లు సిఫారసు చేసింది. మొదటి గ్రూపులో రెల్లి, అనుబంధ ఉపకులాలకు 1%, రెండో గ్రూపులో మాదిగ, అనుబంధ కులాలకు 6.5%, మూడో గ్రూపులో మాల, అనుబంధ కులాలకు 7.5% చొప్పున రిజర్వేషన్లను ప్రతిపాదించింది. రెండు, మూడో గ్రూపుల్లో 0.5% ఉన్నందున దీన్ని సర్దుబాటు చేసేందుకు 200 రోస్టర్లను సిఫారసు చేసింది. మొదటి 100లో మూడు గ్రూపులకు వరసగా 1%, 6%, 8%గా, రెండో వందలో 1%, 7%, 7% చొప్పున ఇచ్చారు' అని సీఎం వెల్లడించారు.

### * సుదీర్ఘ పోరాటం.. నా అనుబంధం

'మంద కృష్ణమాదిగ దండోరా పేరుతో నారావారిపల్లెలోని మా ఇంటి నుంచే పాదయాత్ర ప్రారంభించారు. మా అమ్మకు వినతిపత్రమిచ్చి, ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. ఇవన్నీ గుర్తు చేసుకున్నప్పుడు భావోద్వేగానికి గురవుతాం. వారి డిమాండ్లు సమంజసంగా ఉండడంతో అప్పట్లో జస్టిస్ రామచంద్రరావు కమిషన్ వేశాం. ఆ కమిషన్ ఎస్సీలను నాలుగు కేటగిరీలు.. ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలని నివేదించింది. దానిపై మేం తెచ్చిన చట్టాన్ని హైకోర్టు సమర్థించగా, సుప్రీంకోర్టు కొట్టేసింది. 2007లో ఏర్పాటైన ఉషా మెహ్రా కమిషన్.. 2000 04 మధ్యలో వర్గీకరణతో అన్నివర్గాలకు కొంత మేలు జరిగిందని పేర్కొంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు నిండినా, అసమానతలపై పోరాడాల్సి వస్తోంది. కొన్ని కులాల జనాభా కొన్ని జిల్లాల్లో ఎక్కువగా ఉంది. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మాలలు అధికంగా ఉండగా, మాదిగలు రాయలసీమలో ఎక్కువగా ఉన్నారు. జిల్లాల వారీగా రిజర్వేషన్లు అమలు చేయాలంటే జనాభా లెక్కలు సరిగా లేవు. అందుకే ఆ మేరకు సిఫారసు చేయలేకపోతున్నట్లు మిశ్ర కమిషన్ తెలిపింది. 2026లో జనగణన చేపట్టాక, ఆ డేటా ఆధారంగా జిల్లాల వారీగా వర్గీకరణ చేసుకోవచ్చని సూచించింద'ని చంద్రబాబు తెలిపారు.

### * కులవివక్షపై యుద్ధం..

'కులవివక్షపై తెదేపా ప్రభుత్వం యుద్ధం చేసింది. ఒకప్పుడు గ్రామాల్లో బోర్లు, బావుల వద్ద ఎస్సీలు నీళ్లు తీసుకెళ్లకుండా, వీధుల్లో చెప్పులేసుకొని తిరగకుండా, దేవాలయాల్లోకి ప్రవేశించకుండా వివక్ష ఉండేది. టీ స్టాళ్లలో రెండు గ్లాసుల విధానం ఉండేది. ఇవన్నీ చూశాక జస్టిస్ పున్నయ్య కమిషన్ వేశాను. 42 సిఫారసులు చేస్తే, దానిపై 25 జీవోలు, మెమోలు ఇచ్చాం. గిరిజన ప్రాంతాల్లో వారి భూములకు భద్రత కల్పించేలా చట్టం తెచ్చాం. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సెల్ ఏర్పాటు చేశాం. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అధికారుల బృందాలను గ్రామాలకు పంపించాం. దళితుల సమస్యలపై పోరాడే సంస్థలు, వ్యక్తులకు ప్రోత్సాహకాలు అందించాం. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటుచేశాం. ఎస్సీల తరఫున వాదించేందుకు నిపుణులైన న్యాయవాదులను నియమించాం. మొదటిసారి దళితుడు బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌ను చేసిన పార్టీ తెదేపా. దళితురాలు ప్రతిభాభారతిని శాసనసభ స్పీకర్‌ను చేశాం. ఐఏఎస్ కాకి మాధవరావును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించాం. దేశంలో తొలిసారి ఎస్సీ, ఎస్టీలకు 50% ఇళ్ల రిజర్వేషన్ అమలు చేసింది ఎన్టీఆరే. ఎస్సీ, ఎస్టీ పిల్లలు చదువుకోవడానికి గురుకులాలు పెట్టారు. ఈ ఏడాది ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా ఎస్సీలకు రూ.340 కోట్ల రాయితీతో ఆర్థిక సహాయ పథకాలను అందిస్తున్నాం. 201419లో ఉప ప్రణాళికను సమర్థంగా అమలుచేశాం. మాల, మాదిగలకు జనాభా ప్రాతిపదికన నిధులిచ్చామ'ని వివరించారు.

### * బేడ, బుడగ జంగాలు గ్రూప్-1లో

'బేడ, బుడగ జంగాల వారు ఏ కులంలోనూ లేరు. దీనికి అప్పట్లో జేసీ శర్మ ఏకసభ్య కమిటీ నివేదిక ఇచ్చింది. బుడగ జంగాలను ఎస్సీ 1 గ్రూపులో చేర్చేందుకు శాసనసభలో తీర్మానించి, కేంద్రానికి పంపిస్తున్నాం. పూర్వపు మద్రాస్ రాష్ట్రంలో బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చలేదు. పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలో మాత్రం వీరు ఎస్సీల్లో ఉన్నారు. 1956లో వీరిని ఉమ్మడి ఏపీలో 10 జిల్లాలకు పరిమితం చేశారు. 1976లో బేడ, బుడగ జంగాలను ఉమ్మడి ఏపీ మొత్తం ఎస్సీల్లో చేర్చారు. 2002లో ఎస్సీ జాబితా నుంచి తొలగించారు. తెలంగాణకు చెందినవారు మాత్రమే ఎస్సీలకు అర్హులని ఇచ్చారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో వీరిని ఏపీలో ఎస్సీల నుంచి తొలగించారు' అని సీఎం వివరించారు.

### * మారుమూల పల్లె నుంచి ప్రస్థానం

'మారుమూల పల్లెలో పుట్టి పెరిగినవాణ్ని. రోడ్డు ఉంటేనే, బస్సు వస్తుందంటే ఇంటికో ఎడ్లబండి కట్టి, మట్టి తోలి రోడ్డు వేసిన జ్ఞాపకాలున్నాయి. విద్యార్థి దశ నుంచే పోరాడి, అంచలంచెలుగా ఎదిగాను. అంటరానితనం నిర్మూలన, సామాజిక న్యాయం కోసం పని చేసినందుకు గర్వంగా ఉంది. ఇటీవల దిల్లీలో బిల్‌గేట్స్‌ను కలిసినప్పుడు 30 ఏళ్ల క్రితం జరిగిన విషయాలు ఆయన చెబుతుంటే సంతృప్తి కలిగింది.

# సినీ ప్రముఖులపై బెట్టింగ్ యాప్‌ల కేసు

(మొదటిపేజీ తరువాయి)

నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, వైకాపా అధికార ప్రతినిధి శ్యామలపై కేసు నమోదైంది. వీరితో పాటు బుల్లితెర నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, సిరి హనుమంతు, వసంతి కృష్ణన్, శోభాశెట్టి, అమృతాచౌదరి, నయనిపావని, నేహాపఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, భయ్యా సన్నీయాదవ్, టేస్టీ తేజ, రీతూచౌదరి, బండారు సుప్రీత తదితరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. బీఎన్ఎస్‌లోని 318(4), 112, రెడ్‌విత్ 49, తెలంగాణ గేమింగ్ యాక్ట్‌లోని 3, 3(ఎ), 4 సెక్షన్లు, ఐటీ చట్టం 2000, 2008లోని 66డి సెక్షన్ల కింద ఈ కేసు నమోదైంది. మియాపూర్‌కు చెందిన వ్యాపారి పీఎం ఫణీంద్రశర్మ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారు. ఈ నెల 17న పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లోనూ శ్యామల, విష్ణుప్రియ, సుప్రీత, టేస్టీ తేజ, భయ్యా సన్నీయాదవ్, ఇమ్రాన్‌ఖాన్ సహా 11 మందిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

### భారీగా కమీషన్లు, పారితోషికాలు'

"చట్టవిరుద్ధ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందుకు వారు భారీగా కమీషన్, పారితోషికం తీసుకుంటున్నారు. ఈ యాప్‌ల కారణంగా అప్పులపాలై అనేక మంది ఆత్మహత్యలు చేసుకోగా, చాలా కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఒక దశలో నేను కూడా వీటి ప్రభావానికి గురయ్యా. నా కుటుంబం హెచ్చరికతో ఆగిపోయా. బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న వారందరిపై చర్యలు తీసుకోవాలి" అని ఫణీంద్రశర్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# రూ.2 వేల కోట్లతో తైవాన్ పారిశ్రామిక పార్క్

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. 'ఐటీఐపీ'కి రాష్ట్ర ప్రభుత్వం కొంగరకలాన్‌లోని ఎలక్ట్రానిక్స్ పార్కులో ఇప్పటికే 15 ఎకరాలను కేటాయించింది. పూర్తి స్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు మరో 250 ఎకరాలను కేటాయించాలని తైవాన్ కంపెనీలు అభ్యర్థించాయి. భూ కేటాయింపులు పూర్తయిన వెంటనే పారిశ్రామికవాడ పనులు ప్రారంభిస్తామని తైవాన్ ప్రతినిధులు స్పష్టంచేశారు. రానున్న మూడేళ్లలో మొదటి దశలో రూ.2,000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమల నిర్మాణం పూర్తయి, ఉత్పాదన ప్రారంభమవుతుంది. ఈ పార్కులో ఎలక్ట్రానిక్స్, సోలార్ పరికరాలను ఉత్పత్తి చేస్తారు. ఆయా పరిశ్రమలకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నిపుణులను అందుబాటులో ఉంచుతామంటూ మంత్రి శ్రీధర్‌బాబు పంపించిన సందేశాన్ని రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ విభాగం డైరెక్టర్ వింగ్ కమాండర్ డా.సూర్యకాంత్ శర్మ తైవాన్ ప్రతినిధులకు వివరించారు. "తెలంగాణలో ప్రతిభావంతులైన మానవ వనరుల లభ్యతతోపాటు అత్యంత అనుకూల పారిశ్రామిక వాతావారణం(ఇకో సిస్టం) ఉంది. అక్కడ పనిచేయనున్న తైవాన్ నిపుణుల కోసం 'ఫర్మోసా టౌన్'ను నిర్మిస్తాం. త్వరలో తెలంగాణలో పర్యటించి సీఎం రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబులకు మా ప్రణాళికలను వివరిస్తాం" అని తైవాన్ ప్రతినిధుల గ్రూప్ ఛైర్మన్ సైమోన్ లీ వివరించారు. ఒప్పంద కార్యక్రమంలో తైవాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి హో చున్సిన్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా తైపీ అసోసియేషన్ మన్వర్‌సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగల్లా వచ్చి.. సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు

అమరావతి: వైకాపా ఎమ్మెల్యేలు ఎవరికీ కనిపించకుండా దొంగల్లా వచ్చి హాజరుపట్టీలో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు ధ్వజమెత్తారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండాల్సిన సభ్యులకు ఇలా దొంగచాటుగా సంతకాలు పెట్టాల్సిన ఖర్మ ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. సంతకాలు చేసి సభకు రాకుండా ముఖం చాటేయటం వారి గౌరవాన్ని తగ్గిస్తుందే తప్ప.. ఏ మాత్రమూ పెంచదని పేర్కొన్నారు. ఓట్లేసి ఎన్నుకున్న ప్రజలకు ఆదర్శంగా నిలవాలే కానీ తలవంపులు తెచ్చేలా ప్రవర్తించొద్దని సూచించారు. సభకు హాజరై తమ సమస్యలపై మాట్లాడాలనే ప్రజలు వారిని ఎన్నుకున్నారు తప్ప.. ఎవరికీ కనిపించకుండా హాజరుపట్టీలో సంతకాలు చేసి వెళ్లిపోవటానికి కాదని అన్నారు. ఇప్పటికైనా వారంతా గౌరవంగా సభకు రావాలని పిలుపునిచ్చారు.

### * నాకు కనిపించలేదు.. మీకు కనిపించారా?

'వైకాపా ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, రేగం మత్స్యలింగం, విరూపాక్ష, మత్స్యరాశ విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, దాసరి సుధ హాజరుపట్టీల్లో సంతకాలు పెట్టినట్లు నా దృష్టికి వచ్చింది. గత నెల 24న గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత నుంచి వీరంతా వేర్వేరు తేదీల్లో సంతకాలు పెట్టారు. వారెవరూ సభలో నాకు కనిపించలేదు. మీకెవరికైనా కనిపించారా?' అని సభాపతి సభ్యుల్ని ప్రశ్నించారు. కర్నూలులో గ్రీన్ కో ప్రాజెక్ట్‌కు సంబంధించి వైకాపా ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, బి.విరూపాక్షిలు లిఖితపూర్వకంగా పంపించిన ప్రశ్న.. ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకొచ్చింది. అయితే ఆ పార్టీ సభ్యులెవరూ సభకు హాజరుకాకపోవటాన్ని ప్రస్తావిస్తూ సభాపతి మాట్లాడారు. 'వైకాపా సభ్యులు లిఖితపూర్వకంగా ప్రశ్నలను సభకు పంపిస్తున్నారే తప్ప.. ఆ ప్రశ్నలు అడగటానికి సభలో ఉండట్లేదు. అసలు వారు సభకే రావట్లేదు. దీని వల్ల ఈ సమావేశాల్లో 25 ప్రశ్నలకు సభలో సమాధానాలు లభించలేదు. అంతేకాకుండా మరికొందరు సభ్యులు ప్రశ్నలు అడిగే, వాటిపై మాట్లాడే అవకాశం కోల్పోతున్నారు.

# ట్రంప్ ఫోన్‌కాల్‌తో ఎలాంటి ఒత్తిడి ఎదుర్కోలేదు

(మొదటిపేజీ తరువాయి)

బుధవారంనాటి పరిణామాలపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంభాషణ ఫలప్రదంగా సాగిందన్నారు. రష్యాఉక్రెయిన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన అవసరాల జాబితాను కీవ్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. పోరు తాత్కాలిక విరమణలో ఇంధన మౌలిక సదుపాయాలు మాత్రమే కాకుండా రైలు, ఓడరేవు సౌకర్యాలు ఉండవచ్చన్నారు. కొన్ని రంగాలపై నెలరోజులపాటు పోరు విరమణ గురించి రష్యా నుంచి సంబంధిత పత్రం వచ్చేవరకు దాడులు కొనసాగుతూనే ఉంటాయన్నారు. "రష్యా ఆక్రమించిన జపోరిజియా అణువిద్యుత్తు ప్లాంటు గురించి చర్చించాం. దానిని మాకు తిరిగి ఇస్తే, దాని ఆధునికీకరణ, పెట్టుబడుల్లో అమెరికా ప్రమేయంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాను. ట్రంప్ ఉక్రెయిన్‌లో పర్యటిస్తే యుద్ధాన్ని ఆపేందుకు ఎంతో తోడ్పడుతుంది" అని చెప్పారు. ఏయే రకాల మౌలిక సదుపాయాలకు దాడుల నుంచి రక్షణ లభిస్తుందనేది ఈ వారాంతంలో సౌదీ అరేబియాలో జరిగే చర్చల్లో తెలుస్తుందన్నారు. తమకు సాయం అందించడాన్ని పాశ్చాత్య దేశాలు నిలిపివేయాలన్న రష్యా షరతును ఆయన తోసిపుచ్చారు.

# భారత సైన్యం అమ్ములపొదిలోకి మరిన్ని అస్త్రాలు

(మొదటిపేజీ తరువాయి)

రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) రూ.54,000 కోట్ల విలువైన సైనిక ఆధునికీకరణ ప్రాజెక్టులకు గురువారం ప్రాథమిక ఆమోదం తెలిపింది. ఇందులో టి90 ట్యాంకుల ఆధునికీకరణతో పాటు.. గగనతల ముందస్తు హెచ్చరికల వ్యవస్థల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతిపాదనలూ ఉన్నాయి. మరోవైపు ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) కూడా కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ (అటాగ్స్) అనే శతఘ్నులను సైన్యంలో తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రూ.7,000 కోట్ల విలువైన భారీ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం.. మొత్తం 307 శతఘ్నులను సైన్యం కోసం కేంద్రం కొనుగోలు చేయనుంది. దీంతో పాటు.. 327 గన్ టోయింగ్ వాహనాలకూ ఆర్డర్ ఇవ్వనుంది.

# దశాబ్దాల కల.. నెరవేర్చిన కాంగ్రెస్

**: సీఎం రేవంత్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం**

*** బోయ దేవేందర్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మూడు దశబ్దాలుగా పోరాడుతున్న వర్గీకరణ కలను.. అధికారం చేపట్టిన కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే విధంగా వర్గీకరణ చట్టం అమలుతో నెరవేర్చిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్ర జాతీయ రహదారిపై ఎస్సీ సెల్ బ్లాక్, మండల కమిటీల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణనను అసెంబ్లీలో ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ్మ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బోయ దేవేందర్




మాట్లాడుతూ మాదిగ జాతి సోదరుల చిరకాల డిమాండ్ ఎస్సీ వర్గీకరణ ఒకవైపు, బీసీలకు రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు బీసీ కులగణన మరోవైపు ఏకకాలంలో అసెంబ్లీలో ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని మరోసారి రుజువైందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించగానే తెలంగాణ ప్రభుత్వం ఏక సభ్య కమీషన్ ద్వారా సమగ్ర అధ్యయనం చేయించి అసెంబ్లీ వేదికగా ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఊదరి నర్సింహ్మ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊదరి శ్రీనివాస్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బక్క శ్రీనాథ్, మాజీ సర్పంచ్ లు ఊదరి నరసింహ, గుడ్డేటి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊదరి వెంకటేష్ మహాజన్, బర్రె నర్సింహ్మ, ఎర్రగుంట వెంకటేష్, కొమ్ము లక్ష్మయ్య, బండమీది వెంకటేష్, బండమీది ఎల్లయ్య, ఊదరి రమేష్, ఎర్ర శంకర్, ఊదరి శంకర్, మాదని గోపాల్, పస్తం గంగారాములు, గుడ్డేటి దశరథ, బోయ వెంకట్, బోయ ఆనంద్, బోయ అరవింద్, బోయ సంపత్, తూర్పింటి వంశీ, దాసరి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు ఘన సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంను చౌటుప్పల్ మండల కేంద్రం సిపిఐ మండల పార్టీ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి, గత ఎన్నికల్లో పొత్తులో భాగంగా మిత్ర ధర్మాన్ని పాటించి ఎమ్మెల్సీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ్మ, సిపిఐ చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, ఎస్ ఏ రెహమాన్, కొండూరు వెంకటేష్, బత్తుల సుధాకర్, రొండి నరసింహ, టంగుటూరి రాములు, దాసరి అంజయ్య, నీల బిక్షపతి, బోయిని యాదయ్య, రోషణగారి అంజయ్య, కుంటి పాపయ్య, దాసరి కృష్ణ, కౌసల్య, గుండెబోయిన భాస్కర్, ఉడుత రాజు, ఉబ్బు దర్శన్, సింగపంగ బుచ్చయ్య, దాసరి మనోహర్, మహేశ్వరం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్ కు ఘన స్వాగతం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు బీఆర్ఎస్ శ్రేణులు చౌటుప్పల్ లో గురువారం ఘనంగా స్వాగతం పలికాయి. సూర్యాపేట జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న కేటీఆర్ కు చౌటుప్పల్ మండల కేంద్రం జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చారు. పుష్పగుచ్చం అందజేశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. కేటీఆర్ స్వాగతం పలికిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ సూర్యాపేటకు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, పిఎసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు పెద్దిటి బుచ్చిరెడ్డి, కర్నాటి వెంకటేశం, బిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు ఢిల్లీమాధవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అల్మాస్ పేట కిష్టయ్య, బీఆర్ఎస్ యూత్ మున్సిపల్ అధ్యక్షుడు తొర్పునూరి నర్సింహ్మ గౌడ్, కొత్త పర్వతాలు యాదవ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, చిన్నం బాలరాజు, మెట్టు మహేశ్వర్ రెడ్డి, గుండెబోయిన వెంకటేష్ యాదవ్, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, ఊడుగు మల్లేష్ గౌడ్, గుండెబోయిన అయోధ్య యాదవ్, సుర్వి మల్లేష్ గౌడ్, మునుకుంట్ల నర్సింహ్మ గౌడ్, బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎండీ అహతర్ పాషా, నలపరాజు రమేష్, ఎస్ కె మున్నా, చెక్క రాములు, చెవగోని మహేష్, జువ్వి శివ, బాలగోని శ్రీనివాస్, బండ్ల శ్రీకాంత్, దోర్నాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఆలేరు పెద్దవాగు పై ఉన్న బ్రిడ్జిని వెడల్పు చేయాలి

*** సిపిఎం ఆలేరు పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్**

యాదాద్రి భువనగిరి జిల్లా, ప్రజాస్ఫూర్తి : సిపిఎం పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆలేరు పెద్ద వాగు పై ఉన్న బ్రిడ్జిని పరిశీలించారు ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ మాట్లాడుతూ నిజాం కాలంలో నిర్మించిన బ్రిడ్జి శిధిలావస్థకు చేరిందని గతంలో అనేకసార్లు ఈ బ్రిడ్జి పై ప్రమాదాలు జరిగి అనేకమంది వికలాంగులుగా మారారని ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని అయినప్పటికీ మన పాలకులు ఆలేరు పెద్దవాడి పై బ్రిడ్జిని నిర్మించడంలో నిర్లక్ష్యం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఆలేరు పట్టణానికి శివారు న ఇరుకు బ్రిడ్జి వల్ల పట్టణ వ్యాపార సముదాయాలు పెరగడం కోసం ఈ బ్రిడ్జి ఆటంకంగా ఉందని ఆలూరు పట్టణానికి పెద్ద వాగు ముగింపు ప్రాంతంగా నిలిచిపోయిందని వివిధ గ్రామాల నుండి ఆలేరు పట్టణానికి వ్యాపార నిమిత్తం వచ్చే ప్రజలు ఈ బ్రిడ్జి పై నుండి దాటడం కోసం అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు బ్రిడ్జినికి అవతల ప్రభుత్వ ఆసుపత్రి ఎంపీడీవో కార్యాలయం వ్యవసాయ మార్కెట్ కార్యాలయాలకు వెళ్లేవారు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లవలసిన పరిస్థితి ఉందని అన్నారు వృద్ధులు వికలాంగులు ఈ బ్రిడ్జి దాటాలంటే ప్రాణగండం గా ఈ బ్రిడ్జి తయారైందని ఆయన అన్నారు సిపిఎం పోరుబాట సందర్భంగా ప్రజా సమస్యలను పరిష్కారం కోసం సిపిఎం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు స్థానిక ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య గారు ఎన్నికల సందర్భంగా ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ఇక్కడ ప్రజలకు హామీ ఇచ్చారని వెంటనే ఐలయ్య గారు ప్రభుత్వంతో మాట్లాడి పెద్ద వాగు పై బ్రిడ్జిలు వెడల్పు చేయడం కోసం నిధులు వెచ్చించే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మోరిగాడి రమేష్ బొప్పిడి యాదగిరి కాసుల నరేష్ చెక్క పరశురాములు మోరిగాడి లక్ష్మణ్ ఎండి మతిన్ యాసారపు ప్రసాద్ ఎండి ఖలీల్ మాదాను నవీన్ కటకం సుదర్శన్ ఎండి అమీర్ బర్ల సిద్ధులు ఘనగాని రాజు గాడి పెళ్లి ప్రశాంత్ మోరిగాడి అంజయ్య

## నిండు గర్భిణి కి రక్తదానం చేసి ఆదుకున్న రాంజీ నాయక్ చౌహాన్



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మాడోత్ రాంజీ నాయక్ ప్రజా సేవలో మునిగిపోయారు. బుధ వారం రాత్రి పుట్టగుడెం తండాకు చెందిన 9 నెలల గర్భిణి భూక్యా సరితకు పురిటి నొప్పులతో బాధపడుతుడగా తన భర్త భూక్యా నరేష్ ద్వారా తెలుసుకున్న రాంజీ నాయక్ చౌహాన్ డెలివరీ కోసం తన సొంత కారులో హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అపరేషన్ కి సరిపడా రక్తము లేదని వెంటనే రక్తం అందించి తల్లి బిడ్డను కాపాడుకోవాలని డాక్టర్ సూచన ఇవ్వగా గమనించిన రాంజీ నాయక్ ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అంతే కాకుండా పేషెంట్ కి ఆసుపత్రి ఖర్చులు కూడా అందించాడు. గ్రామంలోని ఎవరికి ఏ ఆపద వచ్చినా రాత్రి పగలు తేడా లేకుండా తన కారుని ఒక అంబులెన్స్ లాగా ఉపయోగిస్తూ ప్రజలకు రాంజీ నాయక్ సేవ చేస్తున్నాడని గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా పుట్టగూడెం వాసులు రాంజీ నాయక్ ను అభినందిస్తూ కృతజ్ఞతలు చెప్పారు.

## మౌంటెన్ బైక్ సైక్లింగ్ విజేతను ఘన సన్మానం



రాజపేట, ప్రజా స్ఫూర్తి : మౌంటెన్ బైక్ సైక్లింగ్ విజేత భూక్య ప్రసాదును ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావులు గురువారం శాలువాతో సత్కరించి అభినందించారు. రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్యా ప్రసాద్ నాయక్ 9వ, తరగతి సిద్దిపేట ప్రభుత్వ పాఠశలలో చదువుతూ సిద్దిపేటలో హాస్టల్ ఉంటూ కేలో ఇండియా ఆకడామీలో శిక్షణ పొంది ఇటివల జరగిన 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అందులో టైమ్ ట్రాయల్ 6 కె. ఎం. సిల్వర్ మెడల్ మాస్ స్టార్ట్ 10 కిలోమీటర్లు గోల్డ్ మెడల్ సాధించాడు. మౌంటెన్ బైక్ సైక్లింగ్ ఛాంపియన్షిప్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది ఈనెల 28 నుండి 31 వరకు జరుగు పోటీలకు తెలంగాణ నుండి ప్రాతినిథ్యం వహిస్తున్నారు హర్యానా లో పార్టిసిపెంట్ చేయబోతున్నాడు. జాతీయస్థాయిలో గెలిచి ఆలేరు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అభినందించారు. తన వంతు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు రాంజీ నాయక్ చౌహాన్, రాజపేట మండలం ఎస్టీ సెల్ అధ్యక్షులు మన్య నాయక్, పుట్టే గూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నరసింహ నాయక్ , వినోద్ నాయక్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 -26 బడ్జెట్ అంకెల గారడి

*** యాదాద్రి భువనగిరి బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్**

యాదాద్రి భువనగిరి , (ప్రజాస్ఫూర్తి) : 3 లక్షల 4 వేల 960 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ అంకెల గారిడి గా ఉందని బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది రూ. 70 వేల కోట్ల లోటు బడ్జెట్ తో ఉన్నది అని సి ఎం రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. గత ఏడాది రూ. 49 వేల కోట్లతో వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపు చేయగా, ఇప్పుడు 24వేల 439 కోట్లతో కేటాయింపు చేశారన్నారు. ఇది ఎలా వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని ప్రశ్నించారు.



50 లక్షల కుటుంబాలకు ఉచితంగా కరెంట్ ఇస్తున్నామని చెబుతున్న కనీసం 25 లక్షలకు మించడం లేదన్నారు. 43 లక్షల కుటుంబాలకు రూ. 500 కు గ్యాస్ సరాపర చేస్తున్నామన్నా అది 25 లక్షల కుటుంబాలకు మించడం లేదన్నారు.అసెంబ్లీ సాక్షిగా అన్ని అబద్ధాలు చెప్పడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పరిపాటి అయ్యిందన్నారు . రైతు భరోసా 18వేల కోట్లు బడ్జెట్లో కేటాయించామని చెప్పిన 3,400 కోట్లు ఇచ్చి రైతులను మోసం చేసారు. ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేల చొప్పున గత సంవత్సరం ప్రకటించి ఇప్పటికీ అమలు చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. అదేవిధంగా ఎన్నికల్లో పేదలకు కొత్త రేషన్ కార్డులు,సన్న బియ్యం ఇస్తామని ప్రకటించిన అమలుకు నోచుకోలేదు. ఆసరా పింఛన్ల పెంపు కోసం బడ్జెట్లో కేటాయింపు జరగకపోగా, ఆరు గ్యారంటీల అమలు అటకెక్కి పోగా, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ ల కు తులం బంగారం,ఆడబిడ్డలకు స్కూటీ ల ఊసే లేదు. ఈ బడ్జెట్ ప్రజల, రైతుల మోసం చేసే విధంగా ఉందని దుయ్యబట్టారు.

## పదవ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: శుక్రవారం నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాధాన్యతను గల పదవ తరగతి పరీక్షలు రేపటి నుండి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. పది పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయి అని, ఈ మైలురాయిని అధిగమించడానికి మీరు ఎంత దృఢంగా నిలబడతారో తదుపరి మీ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధించగలరని ఆయన తెలిపారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు మంచిగా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు.జిల్లాలో 73 పరీక్ష కేం ద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మం ది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు. 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్



స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టాఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మాల్ ప్రాక్టీస్ ను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్ సర్వీస్ లు నడిపేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని తద్వారా నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# ఒకే ప్లేస్ లో పని చేస్తున్న వారిని వెంటనే స్థాన చలనం చేయాలి

* ప్రముఖ హైకోర్టు నర్రి స్వామి కురుమ




యాదాద్రి భువనగిరి జిల్లా, ప్రజాస్ఫూర్తి : పర్యటనలో భాగంగా రామన్నపేట కోర్టు ఆవరణ లోని బార అసోసియేషన్ హాల్లో లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, చౌటుప్పల్ కోర్ట్ బార్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి లాయర్లకు సంబంధించిన క్యాలెండర్ ని న్యాయవాదులకు కక్ష దారులకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లాయర్స్ పోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రముఖ హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ లో పనిచేయుచున్న పి. పి, ఏపీపీ, లో నియామకంలో మరియు ట్రాన్స్ఫర్ విషయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలంటే మూడు సంవత్సరాలకు ఒకసారి ట్రాన్స్ఫర్ చేయాలన్నటు వంటి నియమాన్ని కచ్చితంగా పాటించాలి. జడ్జిల ట్రాన్స్ఫర్ విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటిస్తున్న న్యాయ వ్యవస్థ మాదిరిగానే డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అధికారులు పీపీలు ఏపిపీల ట్రాన్స్ఫర్ విషయంలో నిబంధనలు పాటించకపోవడం చట్ట విరుద్ధమైన చర్య దీన్ని లాయర్స్ ఫోరం పర్ సోషల్ తీవ్రంగా ఖండిస్తుంది అని నర్రి స్వామి అన్నారు. ప్రతి కోర్టులో లైసెన్ ఆఫీసర్లుగా కోర్టు కానిస్టేబుల్ గా కోర్టు సిబ్బంది గా పనిచేస్తున్న వారిని 3 సంవత్సరాలకు ఒకసారి స్థానచలనం చేయాలని ఆ విధంగా న్యాయవ్యవస్థలో అవినీతిని అరికట్టాలని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి డిమాండ్ చేశారు సమాజంలో న్యాయవాదులపై గౌరవాలు పెరగాలంటే న్యాయవ్యవస్థలో జూనియర్ న్యాయవాదులకు వృత్తిపరమైన శిక్షణ తరగతులను ప్రభుత్వం నిర్వహించాలి డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో రామన్నపేట బార అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గాలి లింగయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి, డి సత్తయ్య గౌడ్, బారా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, ఎం రమేష్, సీనియర్ న్యాయవాది డేవిడ్, రాందాస్, దినేష్ మనోజ్, రమేష్ అనేక మంది పాల్గొన్నారు

## బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ కు సన్మానం



రాజాపేట , ప్రజాస్ఫూర్తి : రాజాపేట మండల కేంద్రానికి చెందిన బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ ను బుధ వారం పలువురు సత్కరించి అభినందించారు. దూది వెంకటపురం గ్రామానికి చెందిన బిజెపి నాయకులు సామాజికవేత్త దైతల శివకుమార్ గౌడ్, గొడిసెల కంఠం గౌడ్ లు పాల్గొన్నారు.

## మానవత్వం పరిమళించిన వేళ..

* మండుటెండల్లో కాళ్లకు చెప్పల్లేకుండా స్కూల్ కి వెళ్తున్న విద్యార్థులకు చెప్పులు అందజేత



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మార్చి నెలలోనే ఎండలు భగభగ మండుతున్నాయి. సూర్యోదయం నుంచి వెళ్లి భానుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. మానవత్వం పరిమళించే మంచి మనసుకు స్వాగతం పలికే సందర్భం కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పన చౌదరి మానవత్వం చాటారు. దట్టమైన అడవి ప్రాంతాల నుంచి గంగమ్మ కాలనీ నుండి గట్టుమల్ల కు నడుచుకుంటూ పాఠశాలకు వచ్చే గిరిజన బిడ్డలు చెప్పుల్లేక రోడ్డుపై నడవలేక అల్లాడుతున్న విద్యార్థులను చూసి ఆమె మనసు చలించింది. విద్యార్థులు చెప్పులు లేకుండా మండుతున్న ఎండల్లో రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న విద్యార్థుల దృశ్యాలను సోషల్ మీడియా ద్వారా కొల్లి ఫౌండేషన్ సభ్యురాలకు చేర్చారు. విద్యార్థులు పడుతున్న బాధను వెంటనే గ్రహించి రూ 2000 లకు చెప్పులను ఖరీదు చేసి విద్యార్థులకు అందించారు. ఆహా ఇది కాదా మూర్తిభవించిన మానవత్వం. శభాష్ కల్పనా చౌదరి ఉదార స్వభావాన్ని అందరూ మెచ్చుకున్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

* పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు చంద్ర రెడ్డి



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతూ ఆర్థికంగా స్థిరపడాలని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం మహిళా గ్రూప్ సభ్యుల సమక్షంలో శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం ఆవరణలోని కమిటీ హాల్లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహిళలను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళలు కేకులు కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ ఎల్. ఇంద్రసేనా , సిఓ సుజాత టి.ఎల్.ఎఫ్ అధ్యక్షురాలు మంజుల, పద్మావతి, పాపిరెడ్డి నగర్ ఎస్.ఎల్.ఎఫ్ అధ్యక్షురాలు వి. శోభరాణి , కార్యదర్శి వెంకటలక్ష్మి , కోశాధికారి సౌజన్య, పాపిరెడ్డి నగర్ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి ఆర్పీ రాణి , కవిత, ఎల్లకొండ శ్వేత గుప్త, తో పాటుగా మహిళా గ్రూప్ లీడర్లు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 56శాతం ఉన్న బిసిలకు బడ్జెట్‌లో మొండి చేయి

* జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్రంలో దాదాపు 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్లో మొండిచేయి చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు మరోసారి అన్యాయం చేస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. రూ.3,04,965 కోట్ల బడ్జెట్లో 56 శాతం ఉన్న బీసీలకు 3.6 శాతం బడ్జెటా అంటే రూ.11,405 కోట్లు మాత్రమేనా అని నిలదీస్తూ ఇదెక్కడి సామాజిక న్యాయమని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మాటల గారడి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేతల్లో చూపించడం లేదని, ఎన్నికలకు ముందు సంవత్సరానికి బీసీలకు 20వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ చేతల్లోకి వచ్చేసరికి విస్మరిస్తుందని అన్నారు. మొదటిసారి బడ్జెట్‌లో బీసీలకు 3 శాతం కేటాయించి, అందులో 2 శాతం నిధులను మాత్రమే ఖర్చుచేసిందని, ఇప్పుడు రెండోసారి బడ్జెట్‌లో 11,405 కోట్లు కేటాయించి బీసీ వర్గాలను మరోసారి మోసం చేస్తుందని అన్నారు. బీసీ బిల్లును కేంద్రానికి పంపామని గొప్పలు చెప్పే సీఎం రేవంత్ రెడ్డి తమ చేతుల్లో ఉన్న బడ్జెట్‌లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం ఎందుకు ప్రకటించడం లేదని, ఇది బీసీలకు చేస్తున్న మోసం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని బీసీ మేధావులు, విద్యావంతులు, బీసీ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజులలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీ ఉద్యమం మొదలవుతుందని అన్నారు.

## మినిమమ్ బడ్జెట్ కూడా కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటి

* ఎఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కూర్ర రాకేష్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా విద్యారంగానికి 15శాతం బడ్జెట్ కేటాయించలేని నిస్సహాయ పరిస్థితిలో ప్రభుత్వం నెట్టివేయబడిరదని, మినిమమ్ బడ్జెట్ కూడా విద్య రంగానికి కేటాయించక పోవడంలో ఆంతర్యం ఏమిటిని ఎఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కూర్ర రాకేష్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.57శాతం నిధులు కేటాయించడంలోని విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్త శుద్ధి ఉందనేది తెలుస్తుందని, ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందని అన్నారు. విద్యారంగాన్ని విస్మరించడంలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు తేడా లేదని, గత ప్రభుత్వంలో వ్యవహరిస్తున్న విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికి విద్యారంగానికి పూర్తి వ్యతిరేకమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం తగదని, పెండిగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయంబర్స్ గురించి ప్రస్తావన లేదని ఆయన విమర్శించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు సుమారుగా 11,600 కోట్లు రూపాయలను కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పరిస్థితి ఏమిటని, కస్తూర్బా ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం ఊసే లేదని, ఈ నిధులు విద్యాభివృద్ధి కోసం కాదని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30శాతం అధిక నిధులు కేటాయించి, విద్యాపరంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. లేనియెడల ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని, ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




## జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ ను నెరవేర్చాలి

* ఇండ్ల స్థలాల కోసం కదం తొక్కిన విలేకరులు.
* మద్దతు తెలుపుతున్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణంలోని గంగా బీషన్ బస్తి రైతు వేదిక సమీపంలో జర్నలిస్టులకు గతంలో కేటాయించిన స్థలాన్ని జర్నలిస్టులకు అప్పగించాలని వారి న్యాయమైన కోరిక ను నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని జర్నలిస్ట్ లు ఇళ్లస్థలాల పోరాట ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా జర్నలిస్టు మిత్రులు తమ పోరాటాన్ని కొనసాగిస్తుండటం అభినందనీయమని వారు అన్నారు. గజం స్థలం రూ. 8 లకే ప్రభుత్వం పంపిణి చేయాలని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గం ఇంచార్జి కనుకుంట్ల కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. చాలీ చాలని వేతనం తో, నిత్యం ఎంతో ఒత్తిడి లో వుంటూ కూడా సమాజం లో జరిగే కార్యక్రమాలని, పేద ప్రజల పక్షాన గొంతుక ఉంటున్న విలేకరులకు ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్ ను నెరవేర్చాలన్నారు. జర్నలిస్ట్ ల దీక్ష కార్యక్రమానికి మద్దతు తెలిపిన జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేష్, బాబా, మురళి, సిపిఐ ఎంల్ మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, ట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి పి. సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు వై. గోపాల్ రావు, ఏఐ యూకేఎస్ జిల్లా కార్యదర్శి బానోత్ ధర్మా, టి యు సి ఐ జిల్లా నాయకులు ఎం. రాజశేఖర్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇండ్ల స్థలం ఇవ్వడం తో పాటు ఇందిరమ్మ పథకం ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు., మున్సిపల్ 5వ వార్డ్ మాజీ కౌన్సిలర్ తలుగు అనిల్ మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్య ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ ఇండ్ల స్థలాల కోసం నిరసన కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్ లు జునుమాల రమేష్, లోగాని శ్రీనివాస్, కాల్లోజీ శ్రీను, అప్పిడి లక్ష్మణ్, వాసాల చంద్ర శేఖర్, కుమార్, అంతడుపుల రాజ శేకర్, జోగాం తారక్, వత్తికొండ రవి, ప్రవీణ్, కృష్ణారావు, రుద్ర రాజ శేఖర్, పోలిశెట్టి రాజశేఖర్, వీరు నాయక్, అఫ్జల్ పఠాన్, ఏలూరి శ్రీనివాస్, ఈశ్వర్, పురం శ్రీనివాస్, పిట్టల రమేష్, ఆనంద్, చింతల చిరంజీవి, బీర రవి, ఖాజా , సత్య ప్రకాష్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల హామీ ఎప్పుడు నెరవేరుస్తారు...

* కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
* జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే నెరవేర్చాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని గంగబిషన్ బస్తీలో ఇంటి స్థలాల కోసం జర్నలిస్టులు చేస్తున్న దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకంగా కొనసాగిందని గుర్తు చేశారు,కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వారికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని,ఇది సరైన పద్ధతి కాదని మండి పడ్డారు,జర్నలిస్టులు ఇంటి స్థలాల కోసం 20 సంవత్సరాలుగా పోరాడుతున్నారని ప్రతీ పార్టీ ఎన్నికల సమయంలో గెలిస్తే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇవ్వడం గెలిచాక హామీని తుంగలో తొక్కడం పరిపాటిగా మారిందని విమర్శించారు.ప్రభుత్వానికీ ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ వృత్తి పరంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న విలేఖరులు జీత,భత్యాలు లేక కుటుంబాలకు విద్యా,వైద్యం అందించలేక ఆర్థికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల స్థలాలు,ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని,లేనిపక్షంలో జర్నలిస్టులు చేసే పోరాటానికి మద్దతు వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబీ,మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

* మాజీ మంత్రి,బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఇఫ్తార్ విందులు మతసామరాస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మాజీ మంత్రి,బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ అన్నారు. గురువారం సూరారం డివిజన్ షాపూర్ నగర్ ప్రధాన రహదారిలోని ఎం.జె గార్డెన్స్ నందు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన "దావత్ ఇ ఇఫ్తార్" కార్యక్రమానికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఎమ్మెల్సీ , బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు లు ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ మతాలకతీతంగా ఇతరులు ఇఫ్తార్ విందులో పాల్గొనడం సోదరభావాన్ని పెంచి లౌకిక విలువలను కాపాడుతాయన్నారు. ముస్లిం సోదరులు నెలరోజులపాటు అత్యంత కఠిన నియమాలతో ఆ అల్లాను ప్రార్థిస్తారని, అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపిస్తూ ఉపవాసాన్ని విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో పలు డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, మతపెద్దలు, మైనార్టీ నాయకులు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్మా ఆధ్వర్యంలో ఆశీర్వాద పూజా కార్యక్రమం

* **10వ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా, ప్రశాంతంగా పరీక్షలు రాయాలి...**
* **జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి..**

ప్రజా స్ఫూర్తి నల్లగొండ : విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి తమ సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని, మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం బిక్షపతి తెలిపారు. గురువారం నల్లగొండలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆశీర్వాద పూజా కార్యక్రమం"లో పాల్గొని మహాశివునికి అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం విద్యాసంస్థల వ్యవహర్తలకు, విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఇఓ బొల్లారం భిక్షపతి మాట్లాడుతూ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావుడదని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పదో తరగతి ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 40 నిమిషాల ముందే చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు, సదుపాయాలను అధికారులు పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జి.వి. రావు,కోశాధికారి మట్ట చెన్నయ్య గౌడ్, గౌరవ అధ్యక్షులు యానాల ప్రభాకర్ రెడ్డి, గంట్ల అనంతరెడ్డి, ట్రస్మా దేవర కొండ డివిజన్ అధ్యక్షులు రామకృష్ణ, నల్లగొండ టౌన్ అధ్యక్షులు అజీజ్, శిరంశెట్టి శ్రీధర్ బాబు, చింతపల్లి మండల అధ్యక్షులు మట్ట అంజయ్య గౌడ్, శంబులింగారెడ్డి, పాముల అశోక్, తిరుమల్ రెడ్డి, హాలియా శ్రీనివాస్, పొట్లపల్లి గిరిధర్ గౌడ్, శాంతినికేతన్ శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, రవీందర్, కన్నయ్య, నరసింహ, లెంకల లక్ష్మి, అశోక్, లింగస్వామి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్లు కేటాయించాలి: కోనేరు సాయికుమార్ ...



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి: ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ పెంచుతూ రాష్ట్ర శాసనసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ బీసీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకం కింద 6000 కోట్లు బడ్జెట్లో కేటాయించినందుకు పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను గాంధీ భవన్ లో తెలంగాణ ఎరుకల గిరిజన హక్కుల పోరాట సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోనేరు సాయికుమార్ కలిసి మెమోరాండం అందజేసినట్లు వెల్లడించారు. అలాగే ఎస్టిలో కూడా వర్గీకరణ గురించి ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మహేష్ కుమార్ గౌడ్ గారి అధ్యక్షతన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ ఆశయ సిద్ది కోసం అహర్నిశలు పనిచేస్తూ పాలనను పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఏకలవ్య కార్పొరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి 500 కోట్ల రూపాయలు ఎరుకల గిరిజనులకు బడ్జెట్లో ప్రవేశ పెట్టాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుర్ర రాములు ఉపాధ్యక్షులు జియా సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..




కూకట్ పల్లి , ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెపిహెచ్ బి రోడ్ నెంబర్ వన్ లోని నాయి బ్రాహ్మణ కమిటీ హాల్ లో నాయి బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుర్గారాణి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఉన్నత స్థాయిలో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణ మహిళలు ముఖ్య అతిథులుగా పాల్గొని తమ అమూల్యమైన సందేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ మహిళలు వెనకడుగు వేయకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ తమ లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. సమాజంలో తమ కంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలని అన్నారు. అనంతరం నాయి బ్రాహ్మణ మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఎంపీ ఈటెల రాజేందర్ కు జన్మదిన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ జన్మదినం సందర్భంగా వారి నివాసం వద్ద బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ కుత్బుల్లాపూర్ తలపై పగిడి పెట్టి శాలువతో సత్కరించి ఖడ్గాన్ని బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి , రాజు యాదవ్ , శ్రీహరి , జగన్ ముదిరాజ్ ,. ఆర్థిక్ యాదవ్ , ముత్యాలు , బిక్షపతి , సుధాకర్ రవి. బాలరాజు ,సాయి హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం, దేశమే అభివృద్ధి

* **రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి...**



నల్గొండ రూరల్, (ప్రజాస్ఫూర్తి) : మహిళ చదువుకుంటే కుటుంబంతోపాటు, సమాజం, తద్వారా దేశమే అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలోని రామగిరి లో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో కోటి రూపాయల ఎస్ డిఎఫ్ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ చదువు ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమని, కుటుంబాలు బాగుపడాలంటే ప్రతి ఒక్కరు చదువుకోవాలి అన్నారు. ఇంటర్మీడియట్ విద్య జీవితాన్ని మార్చే సమయమని, అందువలన సమయాన్ని వృధా చేసుకోకుండా కష్టపడి చదివి పైకి రావాలని, సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న మహిళలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థినిలు చదవాలన్నారు. రామగిరి మహిళా డిగ్రీ కళాశాలను దశలవారీగా అంచలంచలుగా అభివృద్ధి చేస్తున్నామని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మరో నూతన బ్లాక్ ను త్వరలోనే ప్రారంభిస్తామని ,అంతేకాక బయోటెక్నాలజీ ల్యాబ్ ను పూర్తి చేయిస్తామని తెలిపారు. విద్యార్థినిలు సెల్ ఫోన్ ను తక్కువగా వాడాలని, సెల్ఫోన్ తో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా జూనియర్ కళాశాలను బాగా అభివృద్ధి చేయడం జరిగిందని, 400 నుండి 3000 వరకు విద్యార్థుల సంఖ్యను పెంచడం జరిగిందని, అలాగే మహిళా డిగ్రీ కళాశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఈ సంవత్సరం స్టేట్ ర్యాంకు సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 65 ఏటీసీలను మంజూరు చేసిందని, నల్గొండ ఏ టి సి ని త్వరలోనే ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించేందుకు విద్య చాలా ముఖ్యమన్నారు. అందువల్ల విద్యార్థినీ లు బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకు ఓర్చి పిల్లలను చదివిస్తారని, అందువల్ల కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వం కల్పించే ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరాజు మాట్లాడగా,అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు. అనంతరం మంత్రి ఎస్ ఎల్ బి సి కాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల పక్కన మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ పంపు, రెస్టారెంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కాగా 381 సర్వే నంబర్ లో పెట్రోల్ పంపు, రెస్టారెంట్ మహిళా సమాఖ్యల ద్వారా నిర్వహించేందుకుగాను రెండు ఎకరాల స్థలాన్ని సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్ ఎల్ బి సి బత్తాయి మార్కెట్లో నిర్మాణంలో ఉన్న తాగునీటి వాటర్ ట్యాంక్ ను తనిఖీ చేశారు .వాటర్ ట్యాంకు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిఆర్డిఓ శేఖర్ రెడ్డి తో పాటు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : చందానగర్ హుడా ఫేస్ 2 లోని శిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో మెడికవర్ చందానగర్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎత్తు, బరువు, కంటి, దంత, రక్తపోటు, షుగర్, పల్స్, ఈసీజీ, బీయండి. తదితర పరీక్షలు నిర్వహించారు. ఆదిత్య జనరల్ ఫిజిషియన్, శ్రీ తేజ, విజన్ ఐ కేర్ నుండి నజీర్ తదితరులు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారిన జీవనశైలి తోపాటు పర్యావరణంలో వస్తున్న అనేక మార్పులవల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యంపట్ల కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వలన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానము, నడక, కనీసం 40 నిమిషాలు చేయాలని సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాల ఉత్పత్తులు, చేపలు, గ్రుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాల ని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఆల్కహాల్, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. అనారోగ్యంగా ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాలు పాటించాలని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని కోరారు. తీసుకొనే ఆహారం సమయ పాలన పాటించాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఆలయ కమిటీ నాయకులు శ్రీనివాసరావు, రామిరెడ్డి, రాజయ్య, సిద్ధిరాములు, శ్రీనివాస నాయక్, కిషోర్ బాబు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాలం శ్రీనివాస్, శివరామిరెడ్డి, బాలరాజు, అలాగే హాస్పిటల్ ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి వైద్యసేవలు అందించారు.

## ప్రజల కోసం కలిసి పని చేద్దాం

**మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి**



ప్రజా స్ఫూర్తి ,నల్లగొండ : కమ్యూనిస్టులు పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పోరాడతారని అలాంటి వారితో కలిసి పని చేయడానికి తన సిద్ధంగా ఉన్నానని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోటలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం గురువారం నల్లగొండ లోని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి తో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం ను శాలువాతో సన్మానం చేశారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటలో సిపిఐ నుంచి ఎమ్మెల్సీగా 20 ఏళ్లు నిరంతరం ప్రజల కోసం పనిచేసిన యువ నాయకుడు సత్యం ను ఎన్నుకోవడం మంచి నిర్ణయం అన్నారు. నల్లగొండ జిల్లాలో సిపిఐ నాయకులతో మంచి అనుబంధం ఉందని గుర్తు చేశారు. జిల్లలో ఏ సమస్యలు ఉన్న వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని కోరారు మంత్రిని కలసిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి సీనియర్ నాయకులు ఉజ్జని రత్నాకర్ రావు,మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి లొడంకి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామిలు ఉన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండలంలో గల 10వ తరగతి పబ్లిక్ పరీక్షల సెంటర్లలో ఏర్పాటు పూర్తయినట్లు ఎంఈఓ డాక్టర్ ప్రభు దయాల్ తెలిపారు. చీఫ్ సూపర్ ఇంటెండెంట్ లు డిపార్ట్మెంట్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పరీక్ష నిర్వాహణవిధానాల గూర్చి నియమాలను స్పష్టం చేశారు. కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ విషయంలో బహు జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరు సెల్ ఫోన్లు ఉపయోగించకూడదని, పరీక్ష విధులకు సంబంధం లేని ఎవరినైనా కేంద్రంలోనికి అనుమతించవద్దని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ లకు తావు ఇవ్వకుండా విద్యార్థులు తమ తమ సామర్థ్యాల మేరకు ప్రశాంతంగా పరీక్షలు రాసే వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సకల పరీక్షల సిబ్బందిని కోరారు. మండల పరిధిలో 1200 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అందరూ ధైర్యంతో, నిబ్బరంగా, నిజాయితీగా పరీక్షలను రాయాలని కోరారు.

## కొలన్ వెంకట్ రామ్ రెడ్డి వివాహ విందులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కుమారుడు కొలన్ వెంకట్ రామ్ రెడ్డి వివాహ విందులో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి , నాయకులు తదితరులు పాల్గొన్నారు....





# ఆధునిక మండువా లోగిళ్లు...

**నట్టింట సూర్య కిరణాల కాంతికి ఇల్లంతా ప్రకాశవంతమవుతుంది. బయటి వాతావరణం ఇంట్లో ఎలా ప్రతిఫలిస్తుంది అనుకుంటున్నారు కదూ. అందుకే ఈ 'స్కైలైట్ డిజైన్' ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. పాత ఇళ్లనూ బయటి వెలుతురు పడేలా మార్పులు చేపడుతున్నారు. ఇక కొత్తగా నిర్మించే ఇళ్లల్లో ఈ ట్రెండింగ్ డిజైన్‌కు చోటిస్తున్నారు.**

### మొక్కలపై వెన్నెల...

రోజంతా పనిచేసి అలసిపోయి ఇంటికి చేరుకున్నప్పుడు సాయంకాలపు నీరెండ లేదా నిండు పున్నమి వెన్నెల మన ఎదురుగా సాక్షాత్కరిస్తే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేం కదూ. ఈ 'స్కైలైట్ డిజైన్' ప్రయోజనమిదే. విశ్రాంతి తీసుకోవడానికి, మనసుకు నచ్చినవారితో కూర్చుని మాట్లాడటానికి అనువైన అందమైన ప్రాంతంగా మార్చేయగల శక్తి ఈ డిజైన్‌కు ఉంది. పై అంతస్తుకెళ్లే మెట్లకు పక్కగా చిన్న ఇండోర్ గార్డెన్, సిట్టింగ్ సెట్ ఏర్పాటు చేసుకుంటాం కదా. దీంతోపాటు స్కైలైట్ నుంచి వచ్చే కాంతి లోపల పడేలా పైన కొంత ఓపెన్‌గా లేదా గ్రిల్స్ ఏర్పాటు చేసుకుంటే చాలు. గులకరాళ్ల మధ్య ఉన్న మొక్కలపై పడే వెలుతురు మనసుకెంతో ఉపశమనాన్నిస్తుంది. మొత్తం ఆ ప్రాంతమంతా కొత్తగా కనిపిస్తుంది.

### బల్లపై మెరుపులు...

మండువా లోగిళ్లను పోలి ఉండేలా నిర్మాణం కావాలా? ఇంటికి మధ్యలో కవర్ చేయకుండా వదిలిన సీలింగ్‌కు గ్రిల్స్ వేస్తే చాలు... ఆ భావన కలుగుతుంది. ఆ సీలింగ్ కింద టేబుల్ ఏర్పాటు చేసుకుంటే టీ సమయాల్లో సాయంకాలపు నీరెండను ఆస్వాదించొచ్చు. ఇక రాత్రివేళల్లో అందరితో కలిసి భోజనం చేస్తుంటే బల్లపై పడే చంద్రుని కిరణాలవల్ల ఆరుబయట వెన్నెల్లో ఉన్న అనుభవాన్నీ పొందొచ్చు.

### విహంగాల నీడలు...

మెట్లపైన సీలింగ్‌ను సన్నని రాడ్స్‌తో క్లోజ్ చేయాలి. దీనికి రంగురంగుల మెటల్ బర్డ్స్ లేదా తీగల ఆకృతులను అక్కడక్కడా అటాచ్ చేస్తే చాలు. వెలుతురులో వీటి నీడ కింద ఉన్న మెట్ల పక్క గోడపై పడి, నిజంగానే అవి ఉన్నట్లు భ్రమ కలిగిస్తాయి. భలేగుంది కదూ ఈ 'స్కైలైట్ డిజైన్'. ప్రకృతి మన చెంత ఉన్నట్లు ఫీల్ కలిగిస్తుంది.





## ఉన్నత విద్య కోసం మరో ఆరు దేశాలకు భారత విద్యార్థులు

**ఉన్నత చదువుల కోసం అమెరికా, కెనడా వెళ్లడం ఆనవాయితీ. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులకు అనేక ఆప్షన్లు ఉన్నాయి. కొందరు జర్మనీలో ఇంజినీరింగ్, రోటర్ డామ్‌లో ఎంబీఏ, మరికొందరు హంగేరీలో ఎకనామిక్స్ లేదా న్యూజిలాండ్‌లో క్రియేటివ్ ఆర్ట్స్‌ను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం విదేశాల్లో 13.2 లక్షల మంది భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వీరిలో 4.6 లక్షల మంది అమెరికాలో, 1.83 లక్షల మంది కెనడాలో ఉన్నారని ప్రపంచ బ్యాంకు డేటా చెబుతోంది.**

- ఇటీవలి కాలంలో అమెరికాలో భారతీయ విద్యార్థులపై దాడులు పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ తేలికపాటి మాంద్యం నుంచి కోలుకోవడానికి యూకే ఆర్థిక వ్యవస్థ ఇంకా కష్ట పడుతున్నది. అమెరికా, యూకే, కెనడా వంటి సంప్రదాయ అధ్యయన గమ్యస్థానాలను భారతీయ విద్యార్థులు పునఃసమీక్షించాల్సిన సమయం ఇది.

### జర్మనీ

- జర్మనీలో మొత్తం 423 ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిలో 108 విశ్వవిద్యాలయాలు, 211 అప్లైడ్ సైన్సెస్ విశ్వవిద్యాలయాలు, 52 కళలు, సంగీత కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుతం భారత్ నుంచి 42,997 మంది విద్యార్థులు జర్మనీలో విద్యనభ్యసిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థుల్లో ప్రాచుర్యం పొందిన కోర్సులు ఇంజినీరింగ్, లా మేనేజ్‌మెంట్, గణితం. జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్ డేటా ప్రకారం, జర్మనీలో భారతీయ విద్యార్థుల సంఖ్య గత ఐదేళ్లలో రెట్టింపు అయింది. ఇది జర్మన్ క్యాంపస్‌లలో అతిపెద్ద అంతర్జాతీయ సమాజంగా మారింది.

### నెదర్లాండ్స్

- నెదర్లాండ్స్‌లో 30 కంటే ఎక్కువ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఉన్నాయి. వాటిలో ఎక్కువ భాగం ఆమ్‌స్టర్‌డామ్, రోటర్‌డామ్, గ్రోనింగెన్, డెల్ఫ్ట్‌లలో ఉన్నాయి. నెదర్లాండ్స్‌లోని భారత రాయబార కార్యాలయం లెక్కల ప్రకారం ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో 3,500 మందికి పైగా భారతీయ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో 1,15,000 మంది అంతర్జాతీయ విద్యార్థులు ఉన్నారు. ఇది 2005 నాటికి దేశంలో ఉన్న సంఖ్యకు 3.5 రెట్లు. విశ్వవిద్యాలయాల్లో మొదటి సంవత్సరం విద్యార్థుల్లో సుమారు 40 శాతం మంది ప్రస్తుతం నెదర్లాండ్స్ వెలుపల నుంచి వస్తున్నారు.

### పోలాండ్

- పోలాండ్‌లో దాదాపు 457 విశ్వవిద్యాలయాలు, కళాశాల స్థాయి ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. పోలాండ్‌లో టర్కీ విద్యార్థుల తరువాత రెండో స్థానంలో సుమారు 2,500 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.



### హంగేరి

- హంగేరీలో మొత్తం 65 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో అనేకం బుడాపెస్ట్ కేంద్రంగా ఉన్నాయి. వీటిలో బుడాపెస్ట్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎకనామిక్స్, సెంట్రల్ యూరోపియన్ యూనివర్సిటీ, ఈఎస్సీపి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఉన్నాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) విడుదల చేసిన 2022 గణాంకాల ప్రకారం హంగేరియన్ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1,000 మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారు.

### బెల్జియం

- బెల్జియం ఐరోపాలోని కొన్ని పురాతన, అత్యంత ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలను కలిగి ఉంది. ముఖ్యంగా కాథోలిక్ యూనివర్సిటీ ఆఫ్ ల్యూవెన్, యూనివర్సిటీ ఆఫ్ ఘెంట్, యూనివర్సిటీ లిబ్రే డి బ్రూక్సెల్స్, వ్రిజే యూనివర్సిటీ బ్రసెల్, బ్రస్సెల్స్, ఆంట్వెర్ప్ విశ్వవిద్యాలయం ఉన్నాయి. ఎక్కువ మంది భారతీయ విద్యార్థులు బెల్జియంలో ఉండగా, కొందరు లక్సెంబర్గ్‌లో కూడా ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం బెల్జియంలో 24,732 మంది ప్రవాస భారతీయులు ఉన్నారు.

### న్యూజిలాండ్

- న్యూజిలాండ్‌లో ఎనిమిది విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఆక్లాండ్ విశ్వవిద్యాలయం అత్యున్నత ర్యాంక్ పొందిన ప్రపంచ విశ్వవిద్యాలయం. చాలా మంది భారతీయ విద్యార్థులు ఎంబీఏ చేయడానికి లేదా అకడమిక్ రీసెర్చ్ కోసం న్యూజిలాండ్ వెళతారు. చైనా తర్వాత రెండో స్థానంలో ఉన్న ఈ ద్వీపదేశంలో దాదాపు 15,000 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు.

# హెచ్‌సీఏలో భారీ అవినీతి..







**రూ.90లక్షలకుపైగా నిధుల దుర్వినియోగం**

**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ)లో భారీ అవినీతి జరిగింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియానికి సంబంధించి కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో జరిగిందని తాజాగా ఈడీ జరిపిన విచారణలో తేలింది. రూ.90లక్షలకుపైగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తోంది. అప్పటి హెచ్ సీఏ వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్ సురేందర్ అగర్వాల్ కుటుంబంతో ఈ కుంభకోణానికి సంబంధాలు ఉన్నట్లు తేలింది. క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీల కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో జరిగినట్టు గుర్తించింది. కాంట్రాక్ట్ కంపెనీల నుంచి సురేందర్ అగర్వాల్ కుటుంబ సభ్యుల అకౌంట్లకు మనీలాండరింగ్ జరిగినట్టు ఆధారాలు గుర్తించింది. దీంతో సురేందర్ అగర్వాల్, ఆయన భార్య, కొడుకు, కోడలికి చెందిన రూ.51.29 లక్షల విలువైన ఆస్తులను సీజ్ చేసింది. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ ఆఫీస్ తాజాగా ప్రకటన వెలువరించింది. భారత మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్‌గా సురేందర్ అగర్వాల్ వ్యవహరించారు. వీరి హయాంలో 2019%-%2022 సంవత్సరాలకు గాను బీసీసీఐ నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అవసరమైన క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీలు, అగ్నిమాపక పరికరాలు పర్చేజ్ చేశారు. అయితే ఈ నిధుల్లో భారీగా అక్రమాలు జరిగినట్టు అప్పటి ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్ట్‌లో వివరాలు బయటకు వచ్చాయి. దీంతో 2023 అక్టోబర్‌లో హెచ్‌సీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉప్పల్ పోలీసులు నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఈడీ.. మనీలాండరింగ్ కోణంలో నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేసి, వివరాలు సేకరించింది. ఉప్పల్ స్టేడియానికి పరకరాల సప్లయ్ చేసేందుకు సారా స్పోర్ట్స్, ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్, బాడీ డ్రెంచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చారు. సాధారణం కంటే కుట్రపూరితంగా అధిక ధరలతో లావాదేవీలు నిర్వహించడంతో, ఇలా అక్రమంగా వచ్చిన లాభాలు ఆయా కంపెనీల నుంచి సురేందర్ కుటుంబ సభ్యులకు బదిలీ అయ్యాయి. సురేందర్ భార్య పేరుతో ఉన్న కేబీ జ్యువెలర్స్‌కు, ఆయన కొడుకు అక్షిత్ అగర్వాల్ వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లకు సారా స్పోర్ట్స్ అకౌంట్ నుంచి రూ.17 లక్షలు జమ అయ్యాయి. అలాగే మరో సంస్థ ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా అక్షిత్ అకౌంట్‌కు రూ. 21.86 లక్షలు డిపాజిట్ అయ్యాయి. అలాగే బాడీ డ్రెంచ్ ఇండియా అకౌంట్ నుంచి రూ. 52 లక్షలు బదిలీ అయ్యాయని దర్యాప్తులో తేలింది. ఇలా క్విడ్ ప్రో కో విధానంలో సురేందర్ కుటుంబ సభ్యులకు మొత్తం రూ. 90.86 లక్షలు చేరినట్టు ఆధారాలు సేకరించింది. దీని అధారంగా కేసు నమోదు చేసిన ఈడీ, దర్యాప్తు చేస్తోంది. అయితే తాజాగా ఈ కుంభకోణంపై క్రికెట్ ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దేశవాళీలో హైదరాబాద్ జట్టు ఆటతీరు అంతంతమాత్రమేనని, ఇక ఇలాంటి కుంభకోణాలతో అటు హైదరాబాద్, ఇటు తెలంగాణ పరువు మంట కలిసిందని వాపోతున్నరు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్టాక్ మార్కెట్‌లో లాభాల జోష్..

### 899 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. వరుసగా నాలుగో రోజు లాభాలను నమోదు చేశాయి. బ్యాంకింగ్, ఆటో, ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లు కనిపించాయి. ట్రంప్ సుంకాల ఆందోళనలు ఓ వైపు ఉన్నా.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది వడ్డీ రేట్లలో కోత విధించే ఛాన్స్ ఉందన్న నేపథ్యంలో మార్కెట్లలో ర్యాలీ కొనసాగింది. గురువారం ఉదయం లాభాల్లో మొదలైన మార్కెట్లు ఏ దశలోనూ వెనక్కి తగ్గలేదు. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్75,917.11 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ప్రారంభంలోనే సెన్సెక్స్ 460 పాయింట్లకుపైగా పెరిగింది. ఇంట్రాడేలో 75,684.58 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 76,456.25 పాయింట్లకు చేరి.. చాలారోజుల తర్వాత మరోసారి 76వేల మార్క్‌ను దాటింది.

చివరకు 899.02 పాయింట్ల లాభంతో 76,348.06 వద్ద ముగిసింది. నిఫ్టీ 283.05 పాయింట్ల లాభంతో 23,190.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 2,296 షేర్లు లాభపడగా.. మరో 1,554 షేర్లు పతనమయ్యాయి. మెటల్, మీడియా, ఐటీ, ఎఫ్ఎంసిజి, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ, టెలికాం వంటి అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5 శాతం పెరిగాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో భారతీ ఎయిర్‌టెల్, టైటాన్ కంపెనీ, బజాజ్ ఆటో, బీపీసీఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్ ఉన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్ నష్టపోయాయి.

## నాలుగురోజులు నిలిచిపోనున్న బ్యాంకు సేవలు..




**న్యూఢిల్లీ:** బ్యాంకులు వరుసగా నాలుగు రోజుల పాటు మూతపడనున్నాయి. వారాంతంతో పాటు బ్యాంకుల సమ్మె ఇందుకు కారణం. వచ్చే వారం దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెబాట పట్టనున్నాయి. తమ డిమాండ్ల పరిష్కారం కోసం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. మార్చి 23వ తేదీన అర్ధరాత్రి నుంచి మార్చి 25 వరకు సమ్మె కొనసాగనుంది. దీంతో ఆ రెండు రోజుల పాటు బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయి. డిమాండ్ల పరిష్కారం కోసం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో జరిగిన చర్చలు విఫలమవడంతో సమ్మెకు పిలుపునిచ్చింది యూఎఫ్‌బీయూ. రెండు రోజుల పాటు బ్యాంకుల సమ్మెతో భారత ఆర్థిక రంగం స్తంభించిపోనుంది ఈ సమ్మెలో ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకు సిబ్బంది కూడా పాల్గొననున్నారు. అయితే వచ్చే వారంలో బ్యాంకుల సమ్మె అయినప్పటికీ ముందు నుంచే అంటే మార్చి 22 నుంచే బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయి. మార్చి 22న నాల్గవ శనివారం, తరువాత ఆదివారం బ్యాంకులకు సెలవులు. ఆపై మార్చి 24, 25 (సోమ, మంగళవారం) బ్యాంకుల సమ్మె నేపథ్యంలో దాదాపు నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలకు అంతరాయం కలుగనుంది.

**అందుబాటులో ఆన్‌లైన్ సేవలు..**

బ్యాంకు సేవలు నిలిచిపోనున్నప్పటికీ ఆన్‌లైన్ సేవలు మాత్రం అందుబాటులో ఉ ఒడనున్నాయి. అలాగే ఏటీఎం సేవలు కూడా అందుబాటులో ఉంటాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల పాటు సెలవులు, రెండు రోజుల పాటు సమ్మె కారణంగా నగదు లావాదేవీలు, చెల్లింపులు, అడ్వాన్సులు వంటి బ్యాంకింగ్ సేవలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలకు అంతరాయం నేపథ్యంలో ప్రజలు ముందుగానే బ్యాంకులకు వెళ్లి నగదు లావాదేవీలు జరుపుకోవాల్సిన పరిస్థితి ఉంది.

**యూఎఫ్‌బీయూ డిమాండ్లు ఇవే..**

బ్యాంకుల అంతటా అన్ని ఉద్యోగ కేడర్లలో అవసరమైన మేరకు నియామకాలు చేపట్టాలి. తాత్కాలిక ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించడం, అన్ని బ్యాంకులకు ఐదు రోజుల పని దినాలను అమలు చేయడం, పనితీరు సమీక్షలను ఉపసంహరించుకోవడం, దాడుల నుంచి బ్యాంకు అధికారులు, సిబ్బందికి భద్రత కల్పించడం. గ్రాట్యుటీ చట్టాన్ని సవరించడం వంటి డిమాండ్లతో బ్యాంకులు సమ్మె బాట పడుతున్నాయి.

## యూపీఐలో 'పేమెంట్ రిక్వెస్ట్' పద్ధతికి చెల్లుచీటీ!

### ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట




**న్యూఢిల్లీ:** నానాటికీ పెరిగిపోతున్న ఆన్‌లైన్ మోసాలను అరికట్టడానికి 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్'లో మార్పులు చేయాలని 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' భావిస్తోంది. వ్యాపారి చెల్లింపుల కోసం ఉపయోగించే 'కలెక్ట్ లేదా పుల్ రిక్వెస్ట్' లావాదేవీలను దశలవారీగా నిలిపివేయాలని యోచిస్తోందని సమాచారం.

**'కలెక్ట్ కాల్' లావాదేవీలను ఎందుకు రద్దు చేస్తున్నారు?**

'కలెక్ట్ కాల్'ను 'పుల్ పేమెంట్' అని కూడా పిలుస్తారు. సాధారణంగా, ఏదైనా వస్తువు కొన్నప్పుడు వినియోదారుడు యూపీఐ యాప్‌లో మర్చంట్ ఫోన్ నంబర్ నమోదు చేసి గానీ, అక్కడ ఉన్న కోడ్‌ను స్కాన్ చేసి గానీ డబ్బు చెల్లిస్తుంటారు. దీనిని 'పుష్' లావాదేవీ అంటారు. దీనికి విరుద్ధంగా, కొన్నిసార్లు, వ్యాపారే తనకు రావలసిన మొత్తాన్ని తన యూపీఐ యాప్‌లో ఎంటర్ చేసి, దానిని ఒక లింక్ లేదా కోడ్ రూపంలో కస్టమర్‌కు పంపుతారు. ఆ లింక్‌పై క్లిక్ చేసినా లేదా ఆ కోడ్‌ను స్కాన్ చేసినా, నిర్దిష్ట మొత్తం వినియోగదారుడి బ్యాంక్ అకౌంట్ నుంచి కట్ అవుతుంది. ఈ పద్ధతిలో మర్చంట్ నుంచి పేమెంట్ రిక్వెస్ట్ వస్తుంది, దీనిని 'కలెక్ట్ కాల్'ను 'పుల్ పేమెంట్' అని పిలుస్తారు. అయితే, పుల్ రిక్వెస్ట్‌లో ఉన్న వెసులుబాటును సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకుని, ప్రజలకు మోసపూరిత లింక్‌లు పంపి డబ్బు కాజేస్తున్నారు. పుల్ రిక్వెస్ట్‌ను మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు కాబట్టి ఆ లావాదేవీ పద్ధతిని రద్దు చేసే యోజన చేస్తోంది.

**'పుష్' లావాదేవీలు సురక్షితం**

'పుల్' బదులు 'పుష్' లావాదేవీల వైపే మొగ్గు చూపుతోంది. ఈ పద్ధతిలో వినియోగదారులే స్వయంగా %ఱ=% కోడ్‌లను స్కాన్ చేయడం ద్వారా ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేయడం వంటి సురక్షిత పద్ధతులను ఉపయోగించి చెల్లింపులు చేస్తారు. ఇది భద్రతను పెంచుతుంది. వినియోగదారుల ఖాతాల నుంచి అన్యాయంగా డబ్బు గుంజాలన్న సైబర్ నేరస్తులు లేదా మోసపూరిత వ్యాపారుల కుతంత్రాలు పని చేయవు. ఫలితంగా పుల్ రిక్వెస్ట్ మోసాలు గణనీయంగా తగ్గుతాయి.

## ఐపీఎల్ కప్పు కోసం రికీ పాంటింగ్ పూజలు!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 కోసం అన్ని టీమ్స్ ప్రాక్టీస్ చేస్తుంటే ఓ టీమ్ మాత్రం పూజలు చేస్తోంది. అది కూడా ఏ సాధారణ పూజలు కాదు.. పెద్ద పెద్ద హోమాల రేంజ్‌లో చేస్తున్నారు. ఆ పూజలు చూస్తే ప్రత్యర్థులు కూడా భయ పడి వారితో మ్యాచ్‌లు ఓడిపోయేలా ఉన్నాయి. పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ పుట్టినప్పటి నుంచి ఆడుతన్నా.. ఒక్కసారి కూడా ట్రోఫీ గెలవలేదు. వారితో పాటు ఢిల్లీ క్యాపిటల్స్, ఆర్సీబీ కూడా కప్పు కొట్టకపోయినా.. వాళ్లకున్నంత ఫ్యాన్ బేస్ కూడా పంజాబ్‌కు లేదని చెప్పు కోవచ్చు. ట్రోఫీ గెలిచేందుకు వాళ్లు చాలా సార్లు టీమ్‌లను మార్చేశారు. కెప్టెన్లను ఎన్ని సార్లు మార్చారో లెక్కేలేదు. అలాగే అనేక సార్లు జెర్సీలు, జెర్సీ రంగులు, లోగోలు ఏకంగా టీమ్ పేరు కూడా మార్చుకున్నారు. ఎన్ని మార్చినా, ఏం చేసినా వాళ్లకు కప్పు మాత్రం రాలేదు. అయితే ఈ సారి మాత్రం కప్పు కచ్చితంగా కొట్టాలనే ఉద్దేశంతో ఏకంగా భారీ భారీ పూజలు కూడా చేస్తున్నారు.అయితే ఈ పూజలో పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లతో పాటు ఆ జట్టు హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పాల్గొన్నాడు. అక్కడున్న పూజారులు పూజలు చేయిస్తుంటే.. ఆయన పూజలో పాల్గొన్నారు. ఈ పూజలు చూస్తుంటే ఈ సారి కప్పు పంజాబ్ కొట్టేలా ఉందని అభిమానులు సరదాగా కామెంట్ చేస్తున్నారు. మరి ఈ పూజలు పంజాబ్ కింగ్స్‌కు ఎంత వరకు కలిసి వస్తాయో, వారికి మొదటి ఐపీఎల్ ట్రోఫీని అందిస్తాయో లేదో చూడాలి. ఇక పోతే పంజాబ్ కింగ్స్ టీమ్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉన్న విషయం తెలిసిందే. ఓవరాల్‌గా పంజాబ్ టీమ్ కూడా బాగుంది.

## బంతికి ఉమ్మి రాయడంపై నిషేధం తొలగింపు

### ఐపీఎల్‌కు బీసీసీఐ గ్రీన్ సిగ్నల్



**ముంబై:** ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభంకానుంది. ఈ క్రమంలో ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా బీసీసీఐ ఓ నిర్ణయం తీసుకుంది. బంతికి ఉమ్మి రాయడంపై ఉన్న నిషేధాన్ని తొలగించింది. గురువారం ముంబయిలో ఐపీఎల్ కెప్టెన్ల సమావేశం జరిగింది. మెజారిటీ కెప్టెన్లు బంతికి లాలాజలం రాయడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలనే ప్రతిపాదనకు అంగీకరించారు. దీంతో బీసీసీఐ తాజా నిర్ణయం తీసుకుంది. బంతిని రివర్స్ స్వింగ్ చేసే క్రమంలో పేసర్లు ఉమ్మిని బంతికి రాస్తుంటారు. ప్రధానంగా టెస్టు క్రికెట్లో దీని ప్రభావం ఎక్కువ. కానీ, కరోనా సమయంలో ఐసీసీ బంతిపై ఉమ్మి రాయడాన్ని నిషేధించింది. తర్వాత ఐపీఎల్‌లోనూ దీన్ని అమలు చేశారు. భారత స్టార్ పేసర్ మహ్మద్ షమి, టిమ్ సౌథీతో పాటు చాలా మంది పేసర్లు ఈ మధ్య ఉమ్మిపై నిషేధాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఐపీఎల్‌లో నిషేధం ఎత్తివేయడం వల్ల ఐసీసీ కూడా ఆ దిశగా చర్యలు తీసుకోక తప్పకపోవచ్చు. కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో సలైవా వాడటంపై నిషేధం విధించారని, ఇప్పుడు పరిస్థితులు మెరుగు పడిన నేపథ్యంలో తిరిగి ఆ వెసులుబాటును కల్పించాలని పలువురు క్రికెటర్లు కోరుతున్నారు. భారత్ వెటరన్ మహ్మద్ షమీ, సౌతాఫ్రికా మాజీ పేసర్ వెర్నన్ ఫిలాండర్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ టిమ్ సౌతీ ఈ వెసులుబాటును కలిపించాలని ఐసీసీని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్లో ఈ వెసులుబాటును కల్పించడం, చాలామంది బౌలర్లు ఊరట కలిగించనుంది. నిజానికి టెస్టుల్లో ఈ వెసులుబాటు వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. అయితే వైట్ బాల్ క్రికెట్లో కూడా ఎంతో కొంత ప్రయోజనం ఉంటుందనే నేపథ్యంలోనే ఐపీఎల్ యాజమాన్యం ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపిందనే టాక్ నడుస్తోంది. ఇప్పటివరకు డీఆరెస్ అంటే డెసిషన్ రివ్యూ సిస్టమ్ ను కేవలం ఔట్, నాటౌట్ , నోబాల్, వైడ్ బాల్ వరకే లీగ్ లో వాడేవారు. ఈ ఎడిషన్ నుంచి హైట్ వైడ్ బాల్ కు కూడా వాడనున్నట్లు తెలుస్తోంది. బ్యాటర్ పై నుంచి బంతి వెళ్లినప్పుడు అది వైడ్ బాల్, అవునో కాదో తేల్చేందుకు డీఆరెస్ ను వాడేందుకు ఆటగాళ్లకు అనుమతి లభించనుంది. ఈ క్రమంలో ఆట మరింత ఆసక్తిగా మారనుంది. తాజాగా ఈ నిబంధన గురించి కూడా మీటింగ్ లో చర్చించే అవకాశముంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే, ఈ నిబంధనను అమలు పరిచే అవకాశాలే ఎక్కువగాఉన్నాయి. ఈనెల 22 నుంచి ఐపీఎల్ ప్రారంభమవుతుండగా, తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్ తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. కోల్ కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడనుంది.

## మైదానంలో నాకు అండగా నిలవండి

### ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా




**ముంబై:** ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తమ అభిమానులకు ఓ అభ్యర్థన చేశాడు. ఈ సారి తాను మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు హేళన చేయకుండా అండగా నిలవాలని కోరాడు. బ్యాటింగ్ చేసే సమయంలో.. టాస్ సందర్భంగా మైదానంలోకి వచ్చినప్పుడు తనను ఎంకరేజ్ చేయాలని రిక్వెస్ట్ చేశాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో హార్దిక్ పాండ్యాను సొంత అభిమానులే గేలి చేసిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మను కాదని ముంబై ఇండియన్స్ సారథ్య బాధ్యతలను హార్దిక్ పాండ్యాకు కట్టబెట్టడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. సీజన్ మొత్తం అతనిపై విమర్శలు గుప్పించారు. టాస్ సమయంలో.. బ్యాటింగ్ చేసేటప్పుడు రోహిత్ అని గట్టిగా అరుస్తూ దారుణంగా అవమానించారు. కెప్టెన్సీ ఆఫర్‌తోనే గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌లోకి వచ్చాడని, హార్దిక్ కారణంగానే రోహిత్ సారథ్యం కోల్పోయాడని ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. ఆ సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమై పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. సొంత అభిమానుల చేత ఘోర అవమానానికి గురైన హార్దిక్ పాండ్యా తీవ్ర మానసిక క్షోభను అనుభవించాడు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి అద్భుతంగా పుంజుకొని టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా హార్దిక్ పాండ్యానే కెప్టెన్‌గా కొనసాగించింది. ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన హార్దిక్ పాండ్యా అభిమానులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు నన్ను ప్రోత్సహించండి. నేను సిక్స్ కొట్టినప్పుడు గట్టిగా అరుస్తూ మరింత మద్దతు తెలపండి. టాస్ కోసం వచ్చినప్పుడు.. బౌలింగ్ చేస్తున్నప్పుడు కూడా నాకు అండగా నిలవండి. వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జెర్సీ కలర్ తప్పా మరే రంగును చూడకూడదనుకుంటున్నా. మిమ్మల్ని నేను కోరేది ఒక్కటే.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు. ఈ వ్యాఖ్యలు గతేడాది అతనికి జరిగిన అవమానాన్ని మరిచిపోలేదనే విషయాన్ని సూచిస్తున్నాయి. నిషేధం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు. అతని స్థానంలో సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించనున్నాడు.

## బ్రిటన్ పార్లమెంట్ పురస్కారం మరువలేనిది

### సోషల్ మీడియా వేదికగా ఆనందం పంచుకున్న చిరు



**టాకీస్:** బ్రిటన్ పార్లమెంటు-లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో తనకు జరిగిన సత్కారంపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఈ ఆనందం గురించి చెప్పేందుకు మాటలు సరిపోవంటూ.. తన ప్రయాణంలో భాగమైన కుటుంబ సభ్యులు, అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. యూకే పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, దౌత్యవేత్తలు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో.. నన్ను సత్కరించినందుకు హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. 'బ్రిడ్జ్ ఇండియా' సంస్థ జీవిత సాఫల్య పురస్కారం నేను అందుకోవడం సంతోషంగా ఉంది. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంగా ముందుకెళ్లేలా చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సినీ రంగానికి, సమాజానికి చిరంజీవి చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు 'బ్రిడ్జ్ ఇండియా' సంస్థ జీవిత సాఫల్య పురస్కారం అందజేసింది. టాలీవుడ్ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్, 'విశ్వంభర' చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపాయి. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో చిరంజీవి నటిస్తున్నారు.




## జాక్ చిత్రం నుంచి కిస్ సాంగ్ విడుదల

### బొమ్మరిల్లు భాస్కర్ దమ్మున్న దర్శకుడన్న సిద్ధూ

**టాకీస్:** సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా.. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జాక్' . వైష్ణవి చైతన్య కథానాయిక. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాణంలో ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలోని కిస్ సాంగ్‌ను గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆసక్తికర విషయాలు పంచుకుంది. ప్రతి మనిషికి ఒక గోల్ ఉంటుంది. దాన్ని ఎలా సాధిస్తామనేది ముఖ్యం. అదే ఈ సినిమాలో చూపించారు. ఆడియన్స్‌కు వినోదాన్ని పంచడమే మా ముఖ్య ఉద్దేశం. 'ఆరెంజ్' సినిమాలో ఒక పాత్రలో నటించాను. ఇన్నేళ్ల తర్వాత బొమ్మరిల్లు భాస్కర్‌తో పని చేయడం అప్పటి రోజుల్ని గుర్తు చేసిందని సిద్ధూ జొన్నలగడ్డ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ప్రతి హీరో కెరీర్‌లో ఒక ప్రత్యేక పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. నా కెరీర్‌కు టిల్లు పాత్ర అలా గుర్తుండిపోతుంది. రామ్‌చరణ్‌తో కలిసి 'ఆరెంజ్' సినిమాలో నటించాను. భవిష్యత్తులో అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆయనంటే నాకు చాలా ఇష్టం. నేను దర్శకుడి ప్రతిభ చూస్తాను. ఆయన హిట్ సినిమాలు తీస్తున్నారా, లేదా అని నేనెప్పుడూ ఆలోచించలేదు. బొమ్మరిల్లు భాస్కర్ తీసిన ప్రతి సినిమా కొత్తగానే ఉంటుంది. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశానని అన్నారు.

## బాలీవుడ్‌కు ఫిక్స్ అయిన తాప్సీ

టాకీస్: సొట్ట బుగ్గల సుందరి తాప్సీ పన్నుకు యాక్టింగ్ లైఫ్, కెరీర్ ఇచ్చిందే సౌత్ ఇండస్ట్రీ. ముఖ్యంగా టాలీవుడ్ ఆమెకు స్టార్డ్ డమ్ ఇచ్చింది. ఝుమ్మందినాదంతో ఎంట్రీ ఇచ్చిన ఈ ఢిల్లీ డాల్ ప్రభాస్, ధనుష్, వెంకటేశ్, గోపీచంద్, రవితేజ, మోహన్ లాల్, అజిత్ లాంటి సౌత్ స్టార్లతో జోడీ కట్టింది. అంతలో బాలీవుడ్ రమ్మంటే అక్కడకు వెళ్లిపోయింది. ఇక అప్పటి నుండి మేడమ్‌లో ఒరిజినాలిటీ- బయటకు వచ్చింది. నార్త్ బెల్ట్‌కు వెళ్లి టాలీవుడ్‌పై నోరు పారేసుకోవడంతో స్టార్స్‌తో నటించే ఛాన్స్ పోగొట్టు-కున్నట్లయ్యింది. బాలీవుడ్ వెళ్లాక లేడీ ఓరియెంట్ చిత్రాలతో పాపులర్ అయ్యింది తాప్సీ. పింక్, నామ్ షబానా, తప్పడ్, హసీనా దిల్ రుబా, బద్లా లాంటి సినిమాలో ఆమె ఇమేజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ మధ్యలో తెలుగులో సినిమాలు చేసింది కానీ అవి పెద్దగా ఆడలేదు. ఆనందో బ్రహ్మ తర్వాత చేసిన ఏ తెలుగు సినిమా హిట్ కాలేదు. 2022 తర్వాత మిషన్ ఇంపాజిబుల్ చేశాక టాలీవుడ్ వైపు తొంగి చూడలేదు సొట్టబుగ్గలసుందరి. పూర్తి సేవలు బీటౌన్‌కే అందిస్తోంది. కెరీర్ స్టార్ట్ చేసిన దశాబ్దం దాటిన నార్త్ బెల్ట్‌లో త్రీ ఖాన్స్‌లో కేవలం షారూఖ్‌తో జోడీ కట్టింది తాప్సీ. సీనియర్ల కంటే జూనియర్లే బెటర్ అనుకుందేమో ఎక్కువగా యంగ్ హీరోలతో యాక్ట్ చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు ప్రాజెక్టులున్నాయి. ప్రతీక్ గాంధీ సరసన హో లడకీ హై కహాన్. ఇస్వాక్ సింగ్‌తో గాంధారీ చేస్తోంది బ్యూటీ. రీసెంట్లీ- గాంధారీ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. త్వరలో నెట్ ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది. మరీ బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న తాప్సీ.. ఇక టాలీవుడ్ కు టాటా చెప్పే సినట్లేనా.. అన్న ప్రచారం సాగుతోంది.




## మాతృత్వపు మాధుర్యం ఆస్వాదిస్తున్నా

### తల్లిగా షూటింగ్‌లో పాల్గొనడం సవాలే అంటున్న దీపిక



**టాకీస్:** బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బిడ్డతో కొంతకాలంగా సరదాగా గడిపిన దీపికా తిరిగి షూటింగ్‌లలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ

నేపథ్యంలో తల్లిగా తన కుమార్తెతో సమయం గడపడం, చిత్రీకరణలో పాల్గొనడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఒక తల్లిగా చిత్రీకరణలో పాల్గొనడం అనేది ఎప్పుడూ సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై షూటింగ్‌లలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్రీకరణల్లో పాల్గొనాలి. ఈ విషయంలో సలహాలు ఇచ్చేందుకు ఎంతోమంది మహిళలు ఉన్నారని నాకు తెలుసు. కానీ, ఇది నాకు అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నాను. కచ్చితంగా దీన్ని ఎదుర్కొంటాననే నమ్మకం నాకు ఉంది. మాతృత్వం అనేది గొప్ప అనుభూతి. ఇది నేను ఎంచుకొనే సినిమాలపై ప్రభావం చూపుతుందని నాకు తెలుసు. నేను తల్లి కాకముందు కూడా సినిమాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నాను. ఇకపై కూడా అలానే తీసుకుంటాను' అని దీపికా చెప్పారు. దీపికా చివరిసారిగా 'సింగం అగైన్' లో శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు- గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.

## రజనీ స్ఫూర్తితో లూసిఫర్‌లో సన్నివేశం



**టాకీస్:** మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'లూసిఫర్2: ఎంపురాన్. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ముస్తాబవుతోంది. 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్ సొంతం చేసుకున్న 'లూసిఫర్'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా 'లూసిఫర్'లోని ఓ సన్నివేశం గురించి పృథ్వీరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. లూసిఫర్' సినిమా మొత్తానికి మోహన్‌లాల్ ఎంట్రీ సన్నివేశం హైలైట్‌గా నిలిచింది. ఆ సన్నివేశానికి రజనీకాంత్ స్ఫూర్తి అని దర్శకుడు తెలిపారు. 'మోహన్‌లాల్ అంటే ఎవరో చెప్పడానికి లూసిఫర్‌లో ఒక్క సన్నివేశం సరిపోతుంది. ఆ ఎంట్రీ సీన్ మొత్తాన్ని రజనీకాంత్ గురించి విన్న కథను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించాను. రజనీ నివాసం ఉండే పోయెస్ గార్డెన్ వీధిలో ఎప్పుడూ ఎలా ఉంటుందో ఒక వార్తా కథనంలో చదివాను. ఆ కథనాన్ని చదివిన తర్వాత రజనీకాంత్‌ని స్ఫూర్తిగా తీసుకొని ఒక సీన్ రాశాను. అదే మోహన్‌లాల్ ఎంట్రీ- సీన్. సినిమాలో దానికి మంచి ఆదరణ లభించిందని చెప్పారు.

రజనీకాంత్‌కు పృథ్వీరాజ్ వీరాభిమాని అని తెలిసిందే. గతంలోనూ ఎన్నో సందర్భాల్లో రజనీకాంత్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తంచేశారు. 'లూసిఫర్ 2' - ట్రైలర్‌ను కూడా ఆయన మొదట రజనీకాంత్‌కు చూపించారు. రజనీ ఈ ట్రైలర్ చూసి తననెంతో ప్రశంసించారని ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. తాను రజనీ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు- చెప్పారు. ఒకసారి ఆ అవకాశం వచ్చినా డేట్స్ సర్దుబాటు- చేయలేక డైరెక్ట్ చేయలేకపోయినట్లు- తెలిపారు.

## బ్లాక్ బస్టర్‌కి కేరాఫ్ అడ్రెస్‌గా మారిన నాని..

### అతను సినిమా చేస్తే హిట్ అనే నమ్మకం..!



**టాకీస్:** టాలీవుడ్ హీరో నాని ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాడు.కష్టాన్ని నమ్ముకొని టాప్ హీరోగా ఎదిగాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌తో అతని కెరీర్ మొదలు కాగా ఇప్పుడు టాప్ హీరోలలో ఒకరిగా, సక్సెస్ ఫుల్ నిర్మాతగా కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు నాని. సహజ నటనతో నేచురల్ స్టార్ అనే బిరుదుని కూడా దక్కించుకున్నాడు. ఇక నిర్మాతగా మంచి కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తూ అలరిస్తున్నాడు. నాని సినిమాలు సూపర్ హిట్ కాకపోయిన ఫ్లాప్ అయితే కావు. కనీసం ఎబోవ్ యావరేజ్ అయిన నడుస్తుంది. గత కొన్నేళ్లుగా నాని సినీ రంగంలో చేసిన ప్రయోగాలు, తీసుకున్న నిర్ణయాలు పరిశీలిస్తే అతని టాలెంట్ ఏ పాటిదో అర్థమవుతుంది.

ఓ స్టార్ హీరోగా భారీ మార్కెట్ కలిగి ఉండే నాని, మాస్ యాక్షన్ సినిమాలకు పరిమితం కాకుండా, విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు వెళుతున్నాడు. 'దసరా' లాంటి గ్రామీణ యాక్షన్ డ్రామా తీసిన నాని , వెంటనే 'హాయ్ నాన్న' లాంటి హృదయాన్ని తాకే కుటుంబ కథా చిత్రం చేశాడు. నిర్మాతగా ఇండస్ట్రీకి కొత్త వారిని పరిచయం చేస్తూ మంచి సక్సెస్‌లు అందుకుంటున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.